# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

**పరిచయము** :

రోమీయులకు వ్రాసిన పత్రిక అనేది ఏమాత్రము అనుమానించకుండా మనుష్యులకొరకు వ్రాయబడిన ప్రభావవంతమైన పత్రిక. ఈ పత్రిక ప్రజలను సరిచేసేదిగా మరియు రూపాంతరము చెందించుటలో మిగిలిన పుస్తకముల కంటెను ఎంతగానో ఉపయోగపడుచునే ఉన్నది. కోట్ల కొలది ప్రజలు ఈ పత్రికలోని సువార్తను విని, తమ తమ జీవితాలలో పూర్తిగా రూపాంతరమును అనుభవించారు. ఈ రూపాంతరము, పరివర్తన కలిగిన కొందరి జీవితాలు మానవ చరిత్ర గతిని మార్చాయి. మార్టిన్ లూథర్ రోమీయులకు 1:17, "నీతిమంతుడు విశ్వాసము మూలముగా జీవించును" అని చదివినప్పుడు, అతని ఆత్మలో ఒక అగ్ని వెలిగింది, ఇది ప్రొటెస్టంట్ సంస్కరణకు ఆజ్యము పోసింది, ఐరోపా చరిత్రను మార్చివేసినది. తరువాత, జాన్ వెస్లీ లండన్ లోని ఒక ప్రార్థనా మందిరములో కూర్చున్నప్పుడు, అతను రోమీయులకు వ్రాసిన పత్రికను గూర్చిన లూథర్ యొక్క పరిచయమును విన్నాడు మరియు తీవ్రముగా వాటిని గమనించాడు. రోమీయులకు వ్రాసిన పత్రికలోని సత్యాలను వినినప్పుడు తన హృదయము వింతగా వేడెక్కిందని వెస్లీ చెప్పాడు. అతడు పొందిన ప్రభావము గొప్ప సువార్త మేల్కొలుపును కలుగజేసినది, ఇది ఇంగ్లాండ్‌ను ఫ్రాన్స్ యొక్క ప్రాబల్యము నుండి కాపాడినది మరియు ఆంగ్ల జీవిత క్షీణతను అదుపుచేయగలిగినది. ఈ ఇద్దరు వ్యక్తుల జీవితాలలో ఈ పత్రిక చూపిన ప్రభావము ప్రపంచ చరిత్రను పూర్తిగా మార్చివేసినది!

అన్ని లేఖనబాగములలో జీవము మరియు మార్పు తీసుకురావడానికి దేవుని యొక్క శ్వాస మరియు శక్తి ఉన్నది. ఇవి అన్నియు ఆయన నుండి ప్రేరణ పొంది మరియు అతని గూర్చిన గుణగణములు మరియు సత్యముతో నిండి ఉన్నవి. కానీ ఈ పత్రిక మిగతా పుస్తకములకు చాలా ప్రత్యేకమైనది. ఇది క్రైస్తవ్యము  యొక్క పూర్తి సందేశానికి అద్భుతమైన వివరణను కలిగి ఉన్నది. ఇది దాదాపు ప్రతి క్రైస్తవ సిద్ధాంతాన్ని ఏదో ఒక రూపములో కలిగి ఉన్నది మరియు ఇది మనిషి యొక్క విమోచన కొరకైన దేవుని అద్భుతమైన ప్రణాళిక యొక్క దృశ్యము. ప్రతి యొక్క క్రైస్తవ కనీస బోధను దీనిలో ప్రస్తావించినట్లు బైబిలు యొక్క వేరే పుస్తకములో గమనించలేరు. ఇది మేము అన్ని లేఖనాలకు కీలకపు తాళపు చెవి (మాస్టర్ కీ) అని పిలుస్తాము. కానీ పౌలు క్రమబద్ధమైన వేదాంతశాస్త్ర పుస్తకాన్ని సమర్పించడము కంటేను ఎక్కువగా మనకు ఈ పత్రికలో తెలియచేసాడు. ఈ సత్యాలను ఎలా జీవించాలో అని చాలా ఆచరణాత్మక ఉపదేశాలను కూడా ఇచ్చాడు. మనము ఈ సత్యాలను స్వీకరించినప్పుడు, దేవుడు మన జీవితాలను, మన కుటుంబాలను, మన దేశాలను మరియు మొత్తము మానవ చరిత్రను మార్చగలడు. అందువలన, రోమీయులకు వ్రాసిన పత్రికను అధ్యయనము చేసిన తరువాత, మనము నమ్మినది మాత్రమే తెలియడము కాదు, కానీ ఎలా జీవించాలో కూడా మనకు తెలుస్తుంది!

**గ్రంథకర్త** :

అపొస్తలుడైన పౌలు నిస్సందేహముగా రోమీయులకు వ్రాసిన పత్రిక యొక్క రచయిత మరియు ఇది అతని యొక్క గొప్ప సాహిత్య సాధన. ఇది అతని 13 ఇతర క్రొత్త నిబంధన పుస్తకములలో మొదటి స్థానములో ఉన్నది. కొరింథులో తన మూడవ మిషనరీ ప్రయాణములో ఉన్నప్పుడు పౌలు ఈ పత్రిక వ్రాసాడు. తరువాత అతను కొరింథు సమీపములోని కెంక్రేయలో ఉన్న సంఘములోని సంఘపరిచారకులగు ఫీబేకు ఈ పత్రిక ఇచ్చాడు మరియు ఆమె దానిని రోమాకు తీసుకువెళ్ళినది. యెరుషలేములోని నిరుపేద పరిశుద్ధుల కొరకు ఆసియా లోని సంఘములు కలిసి సేకరించిన ఆ డబ్బును తీసుకెళ్లడానికి పౌలు యెరూషలేమునకు వెళ్ళాడు.

**రచనాకాలము** :

పెంతెకొస్తను పండుగ దినమున పరిశుద్ధాత్మ అందరి మీదికి వచ్చిన 25 సంవత్సరాల తరువాత రోమీయులకు వ్రాసిన పత్రికను రోమాలోని క్రైస్తవులకు అపొస్తలుడైన పౌలు రాశాడు. రోమాలో సంఘమును ఎవరు స్థాపించారో నిశ్చయముగా చెప్పలేము ఎందుకనగా 1) ఇక్కడ ప్రధానముగా అన్యజనులు ఉన్నారు మరియు 2) పౌలు ఇంకా రోమా కు ప్రయాణించలేదు. పెంతెకొస్తు సమయములో యెరూషలేములో ఉన్న యూదుల బృందము రోమాకు తిరిగి వచ్చి సంఘముని ప్రారంభించారని కొందరు అనుమానిస్తున్నారు. ఆసియా, మాసిదోనియా మరియు గ్రీసువంటి ప్రదేశాలలో పౌలు ప్రారంభించిన ఇతర సంఘముల నుండి వచ్చిన క్రైస్తవులు రోమాలో స్థిరపడటానికి మరియు సంఘమును నిర్మించడానికి వచ్చిన వారు అని మరికొందరు సూచిస్తున్నారు. ఏది ఏమైననూ ఈ ఆదిమ సంఘము క్రమముగా, సరియైన పునాది కలిగి మరియు విశ్వాసములో అభివృద్ధి చెందుచున్నదని గ్రహించవచ్చును (రోమా 1:8, రోమా 15:14). పౌలు వేదాంతశాస్త్రము లేదా ప్రవర్తన విషయాలలో వారిని సరిదిద్దడానికి ఈ పత్రిక వ్రాయలేదు, కానీ వారి విశ్వాసము గురించి వినినందున వారికి వ్రాసాడు. అతని కోరిక ఏమిటంటే, రోమీయులు సువార్త సత్యముపై ఆధారపడి ఉండాలని మరియు అతను వారిని వ్యక్తిగతముగా సందర్శించి ప్రోత్సహించాలని ఆశించాడు (రోమా 15: 22-25).

ఈ పత్రిక వ్రాసే సమయములో, రోమా ఆకట్టుకునే వాస్తుశిల్పము, కళ, వాణిజ్యము మరియు ఆధునిక పురోగతి యొక్క గొప్ప నగరము. "అన్ని రహదారులు రోమా కు దారి తీస్తాయి" అని తరచూ చెప్పబడినది, ఎందుకంటే ఇది చాలా ముఖ్యమైన మరియు అవసరమైన కార్యకలాపాలకు కేంద్రముగా ఉన్నది. రోమీయులు తమ విజయాలలో ప్రగల్భాలు పలుకుతుండగా, సిగ్గుపడటానికి కూడా చాలా కారణాలు ఉన్నాయి. ఇది అన్యమత నైతిక ప్రమాణాలు మరియు బహు దేవతారాధనతో సహా సామాజిక సమస్యలను కలిగి ఉన్నది. పౌలు గారి పత్రిక రాజీ పడే వాటిలో రోమా సంఘమును సరిదిద్దకపోయినా, సమయము మరియు సంస్కృతిని మించి బైబిలు మీద నమ్మకమును మరియు అభ్యాసమును చేయటలో ఇది స్పష్టమైన వేదాంతమును అందించింది.

**నేపథ్యము** :

రోమీయులకు వ్రాసిన పత్రిక యొక్క నేపథ్యము సువార్త, యూదులు మరియు అన్యజనులందరికీ, సమస్త మానవాళికి రక్షణ మరియు నీతిమంతులనుగా చేయుట కొరకైన దేవుని ప్రణాళిక. రోమీయులకు వ్రాసిన పత్రిక యొక్క ప్రాముఖ్యమైన లేఖనబాగము "రోమా 1:16-17 [16]సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది. [17]ఎందుకనిన—నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంత కంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలుపరచబడుచున్నది."

పౌలు తన సువార్త ప్రదర్శనను రెండు భాగాలుగా విభజించాడు. 1-11 అధ్యాయాలు **"ఏమి నమ్మాలి"** అని చెప్పే అధ్యాయాలు. బైబిలు పండితులు సాధారణముగా ఈ సువార్త ప్రదర్శనను "రోమీయుల రహదారి" అని పిలుస్తారు (రోమా 3: 10-12, 23; రోమా 6:23; రోమా 5: 8; రోమా 10: 9-10,13; రోమా 5: 1; రోమా 8: 1, 38-39). ఈ లేఖనభాగముల ద్వారా, రక్షణ ఎవరికి కావాలి, మనకు రక్షణ ఎందుకు కావాలి, దేవుడు నిత్యజీవమును ఎలా ఇస్తాడు, నిత్యజీవమును ఎలా స్వీకరిస్తాము మరియు మన రక్షణ యొక్క ఫలితము ఏమిటి అనే విషయములను పౌలు తెలియజేసాడు. మన పాపము యొక్క స్థితి నుండి మనలను రక్షించే శక్తి దేవునికి మాత్రమే ఉందని దానిలో ఎటువంటి సందేహము లేదు అని

ఖచ్చితముగా తెలియజేసాడు. పాపము యొక్క శిక్షను శ్రమల ద్వారా, సిలువ మరణము ద్వారా యేసు క్రీస్తు భరించాడు మరియు తిరిగి లేచుటవలన యేసు క్రీస్తు మరణాన్ని జయించాడు, దీనిద్వారా మానవాళికి రక్షణను, నిత్యజీవమును కలుగజేసాడు. యేసు క్రీస్తు లేకుండా క్రైస్తవ్యము  అనేది లేదు, కావున మనము ఆయనను తప్పక తెలుసుకోవాలి.

కానీ రోమీయులకు వ్రాసిన పత్రిక సిద్ధాంత గ్రంథము మాత్రమే కాదు. ఇది ఆచరణాత్మక ఉపదేశముల పుస్తకము కూడా ఎందుకనగా క్రైస్తవ్యము  కేవలము మతము కాదు, విశ్వాసము ప్రకారము జీవించవలసిన జీవితము. ఇది మన పూర్తి జీవితమును గూర్చి తెలియజేయడానికి మరియు రూపాంతరము చెందించుటకు ఉద్దేశించబడినది. అందువలన, పౌలు 12-16 అధ్యాయాలలో ద్వితీయ నేపథ్యమును పరిచయము చేశాడు. ఇవి **"ఎలా ప్రవర్తించాలి"** అని చెప్పే అధ్యాయములు, ఈ సత్యములన్నీ మానవ పరిస్థితులకు వర్తించే ఆచరణాత్మకమైనవి. వాస్తవానికి, "విశ్వాసమునకు విధేయులగునట్లు" (రోమా 1: 5, 16:26) అనే క్రీస్తు పనికి మన యొక్క ప్రతిస్పందనతో పౌలు తన లేఖను ప్రారంభించి మరియు ముగించాడు. విశ్వాసము లేకుండా, క్రీస్తు అంత స్వేచ్ఛగా ఇచ్చే రక్షణ, నిత్య జీవమును పొందడము అసాధ్యము మరియు విశ్వాసము లేకుండా మనము దేవుణ్ణి సంతోషపెట్టే జీవితాలను గడపలేము.

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## మొదటి పాఠము : మొదటి అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : దేవుడు తనను తాను మానవాళికి ప్రత్యక్షపరచుకొన్నప్పటికీ, చాలామంది ఆయనను, ఆయన ప్రణాళికను, ఆయన ప్రయోజనాలను తిరస్కరించారు.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 1:1-7 వరకు అధ్యయనము చేయగలరు**

1. రోమీయులకు వ్రాసిన పత్రిక మొదటి వచనములో పౌలు తనను తాను ఎలా వివరించుకున్నాడు?

2. పౌలు ఎవరిని గురించి వ్రాయాలనుకుంటున్నాడు?

3. దేవుని కుమారుని ప్రకారము మనకు ఏమి ఇవ్వబడినది?

4. పౌలు ఎవరికి వ్రాస్తున్నాడు? మీరు ఈ గుంపులో చేర్చబడ్డారా?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 1:8-15 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ వచనములలో పౌలు దేవునికి దేనికొరకు కృతజ్ఞతలు తెలుపుచున్నాడు?

2. రోమా  క్రైస్తవులు ప్రపంచవ్యాప్తముగా దేనికొరకు ప్రసిద్ధి చెందారు?

3. మీరు దేని కొరకు ప్రసిద్ధి చెందాలనుకుంటున్నారు?

4. మిమ్ములను ప్రభావితము చేసిన ఒకరి పేరు వ్రాయుము? వారి విశ్వాసమును బట్టి మీరు దేవునికి కృతజ్ఞతలు చెప్పగలరా?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 1:16-17 వరకు అధ్యయనము చేయగలరు**

1. సువార్తను గురించి పౌలు ఎందుకు సిగ్గుపడలేదు?

2. దేవుని కుమారుడిగా యేసుపై మనకున్న నమ్మకము గురించి మనకు సిగ్గు లేదా సంకోచము కలిగించే విషయముల గురించి మీరు ఆలోచించగలరా?

3. 2 తిమోతి 1: 8-12లో ఏ వాగ్దానము మిమ్ములను ప్రోత్సహిస్తున్నది?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 1:18-23 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని గురించిన సత్యముతో మనిషి ఏమి చేస్తున్నాడు?

2. భూమిపై మానవునికి దేవుడు తనను తాను ఎలా బయలుపరచుకున్నాడు?

3. దేవుని మహిమను మానవులు ఏ విధముగా మార్చివేసారు?

4. ఈ దినములలో మానవులు ఏ ఏ విగ్రహాలను పూజిస్తున్నారు?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 1:24-32 వరకు అధ్యయనము చేయగలరు**

1. "దేవుడు వారిని అప్పగించెను" అనే పదాన్ని ఈ లేఖన బాగములో ఎన్నిసార్లు చూశారు? దేవుడు ఎందుకు ఇలా చేశాడు?

2. సృష్టికర్త అయిన దేవునికి బదులుగా మానవుడు ఎవరిని లేదా దేనిని ఆరాధిస్తున్నాడు?

3. ఈ వచనములలో పౌలు జాబితా చేసిన పాపకరమైన ప్రవర్తనలను తెలియజేయగలరు

4. మీ స్వంత జీవితములో, ఒక పాపము మరియొక పాపమునకు దారితీసి అలా క్రిందికి ప్రవహించుచున్నదా?

5. 32 వ వచనములో మానవుడు దేనికి అర్హుడు?

6. 1 కొరింథీయులు 6: 9-11 నుండి మీరు ఏ ప్రోత్సహమును పొందవచ్చును?

7. ఈ పాఠములో, మీతో ఏ కొత్త హెచ్చరికలు లేదా కొత్త ఆలోచనలు మాట్లాడుతున్నాయి?

**ఆరవ రోజు** :

మొదటి పాఠము : **"దేవుడు ప్రత్యక్షపరచిన సత్యము యొక్క ఫలితము విషాదముగా ఉన్నది"**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 1 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 1:16, "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది." |
| **పాఠ్యాంశ వాక్యము** | దేవుడు తనను తాను మానవాళికి ప్రత్యక్షపరచుకొన్నప్పటికీ, చాలామంది ఆయనను, ఆయన ప్రణాళికను, ఆయన ప్రయోజనాలను తిరస్కరించారు. |
| **జీవిత సూత్రము** | సృష్టికర్త అయిన దేవునికి మనలను సమర్పించడానికి లేదా ఆయనను తిరస్కరించడానికి మనకు ప్రతి ఒక్కరికి ఎంపిక చేసుకోవడానికి అవకాశము ఇవ్వబడుతున్నది. |

**సారాంశము**:

శుభములు మరియు సంక్షిప్త పరిచయము తరువాత, "మీకు సువార్త ప్రకటించుటకు" అని మొదటి అధ్యాయము 15 వ వచనములో ఈ పత్రిక వ్రాయడానికి పౌలు తన ఉద్దేశ్యాన్ని తెలియజేసాడు. ఇది ఈ పత్రికలోని సువార్త అనే కేంద్ర ధృవీకరణకు నిశ్చయతకు మనలను తీసుకువస్తున్నది: "నేను సువార్త గురించి సిగ్గుపడను: ఇది దేవుని శక్తి ..." (1:16). కానీ దేవుని శక్తి గురించి ఎవరు సిగ్గుపడతారు? ఇది విశ్వములో గొప్ప శక్తి. దేవుని శక్తి విశ్వమును సృష్టించినది మరియు నిర్ణయ కాలము వరకు కాపాడబడును. దేవుడు తన శక్తితో ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి రక్షించాడు (నిర్గమకాండము 32:11). దేవుని శక్తి ద్వారా, యేసు మనుష్యులను ఆశ్చర్యపరిచే అద్భుతములు చేశాడు (లూకా 9:43). దేవుని శక్తి మరణ శక్తిని

అధిగమించి యేసును సజీవునిగా చేసినది (కీర్తనలు 49:15, 2 కొరింథీయులు 13: 4). దేవుని శక్తి ద్వారా, మనము దేవుని కుమారులుగా మార్చబడ్డాము (I యోహాను 1:12), మరియు క్రీస్తు బాధలలో పాలుపంచుకుంటున్నాము (2 తిమోతి 1: 8). దేవుని శక్తి విశ్వాసము ద్వారా మనలను కాపాడుచు, ఆ స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నది (I పేతురు 1: 5). దేవుని శక్తి అతనిని మనము స్వీకరించడానికి, ఆయనలో నడవడానికి, ఆయన కొరకు బాధపడటానికి మరియు రూపాంతరము చెందడానికి మనలను ముందుకు నడిపించే శక్తి. పౌలుకు దేవుని శక్తి వ్యక్తిగతముగా తెలుసు మరియు అతను దానినిబట్టి సిగ్గుపడలేదు ఎందుకనగా అది అతన్ని హింసించే సౌలు నుండి అపొస్తలుడైన పౌలుగా మార్చినది. అదే దేవుని శక్తితో, పౌలు సుపరిచితమైన ప్రపంచమంతా పర్యటించి, సువార్త విత్తనాలను నాటాడు, ఇతరులను దేవునితో సమాధానపడాలని మరియు ఆయనలో కొత్త జీవితాన్ని పొందుకోవాలని ఆహ్వానించాడు.

ఇక్కడ నుండి, పౌలు ఒక ప్రాథమిక సత్యమును వివరించాడు; సువార్త దేవుని నీతిని తెలుపుచున్నది. మరియు దేవుని నీతి యొక్క ప్రకాశవంతమైన కాంతి మనిషి పాపాత్ముడు అని గ్రహించేలా చేయుచున్నది. సువార్త మన రక్షణ, విమోచన కొరకైన అవసరతను మరియు మన రక్షకుడిని గూర్చిన అవగాహనను తీసుకొస్తున్నది. యోహాను 16: 8 లోని ఈ ప్రక్రియను పరిశుద్ధాత్మ మనలను ఒప్పుకొనజేసేవారినిగా చేయును అని యేసు ప్రకటించాడు. “మరియు అతను వచ్చినప్పుడు, అతను పాపము, నీతి మరియు తీర్పును గూర్చి లోకమును ఒప్పుకొనజేయును” (యోహాను 16: 8).

దేవుడు తన నీతిని మానవాళికి ఎలా వివరించాడో పౌలు వివరించాడు. రోమా 1:20 మనకు ఇలా చెబుతుంది, “ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు.” ఈ ప్రకారము దేవుడు ఉనికిలో ఉన్న దాని ద్వారా మనకు నిరూపించబడలేదని, కానీ అతను ఎవరో తన అదృశ్యలక్షణముల ద్వారా నిరూపించాడని గ్రహించవలయును. సృష్టి ద్వారా దేవుని గూర్చిన జ్ఞానాన్ని ***సాధారణ ప్రత్యక్షత*** అంటారు. ఇది మానవాళికి అందజేసిన కృప. ఉరుములతో కూడిన మెరుపులు, నక్షత్రాలు, జంతువులు లేదా మానవ శరీరాన్ని గమనించడము ద్వారా మనము ఆయన గురించి ఏమి నేర్చుకుంటున్నాము? వీటన్నిటిలో, దేవుడు తన నీతిని మనకు వెల్లడిస్తున్నాడు.

దేవుడు తన సృష్టి ద్వారా మరియు విశ్వము యొక్క క్రమము ద్వారా తనను తాను మానవులకు తెలిపినప్పటికీ, మానవుడు మాత్రము తరచుగా దేవుణ్ణి ఆరాధించడము కంటే సృష్టిని ఆరాధించడానినే ఇష్టముగా ఎంచుకుంటున్నాడు. మానవుడు దేవుణ్ణి ఆరాధించడము కంటే తాను చేసిన వస్తువులను లేదా దేవుడు చేసిన వస్తువులను ఆరాధించడానికి ఎంచుకుంటున్నాడు. పౌలు ఇలా తెలియజేసాడు, “వారి అవివేకహృదయము అంధకారమయమాయెను; తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యులయొక్కయు, పక్షులయొక్కయు, చతుష్పాద జంతువులయొక్కయు, పురుగులయొక్కయు, ప్రతిమాస్వరూపముగా మార్చిరి” (1: 22-23). వారు దేవుని గురించిన సత్యమును అబద్ధముల కోసము మార్పిడి చేసారు. ప్రతిస్పందనగా, దేవుడు వారిని విడిచిపెట్టాడు. మూడుసార్లు, “దేవుడు వారిని విడిచిపెట్టాడు” అని పౌలు చెప్పాడు.

సంవత్సరాలుగా మనిషి మారలేదు. ఇది ఈ క్రింది స్థితికి దారితీస్తుంది (29-31): అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమనువాటితో నిండినవారై కొండెగాండ్రును, అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును,

బింకములాడువారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రులకవిధేయులును, అవివేకులును, మాట తప్పువారును, అనురాగ రహితులును, నిర్దయులునైరి.

దేవుని పట్ల తమ శత్రుత్వాన్ని, దేవుని సత్యాన్ని అణచివేయడాన్ని ఉద్దేశపూర్వకముగా అవిధేయత చూపడము ద్వారా తిరుగుబాటు చేసే ప్రజల పరిస్థితి ఈ విధముగా ఉంటుంది. వారు ఎటువంటి ప్రమాణములను పాటించరు, వారు వారు ఇష్టపడే విధముగా జీవిస్తారు మరియు వారు ఇష్టపడేది మాత్రమే చేస్తారు. ఫలితము నైతికముగా క్షీణించడము మరియు జీవితము యొక్క సహజ విధానము యొక్క వక్రీకరణ. అధ్యాయములో ముందుకు చదువుచున్నప్పుడు ఈ ఉగ్రత మనకు వివరించబడినది. మనిషి సత్యమును అణచివేసాడు, తనకు నచ్చని వస్తువులను దూరముగా నెట్టివేసాడు. హృదయము, దాని సహజ స్థితిలో, తీరని దుష్టత్వములో మరియు తెలియనిది ఉన్నది. మన పాపపు లోతును అర్థము చేసుకోవడానికి సృష్టికర్త అయిన దేవుడు మాత్రమే మనకు సహాయము చేయగలడు.

దేవుడు మానవజాతితో ఒకవేళ ఇలా చెప్పవచ్చును, “గమనించగలరు, ఒక నిర్దిష్టమైన పని మిమ్ములను  నాశనము చేస్తుంది కావున మీరు దానిని చేయాలని నేను కోరుకోను, ఎందుకనగా, మీరు దానిని చేయమని పట్టుబడుతుంటే, మీరు దానిని చేయవచ్చును, కానీ మీరు దాని పరిణామాలను అంగీకరించాలి. మీరు తప్పుగా జీవించడమును ఎంచుకున్నట్లయితే, ఆ ఎంపిక నుండి వచ్చే పరిణామాలను మీరు నివారించలేరు.” ఇలాంటివి వాటిని చేసే వారు చనిపోయే అర్హత ఉందని ఆయన యొక్క సారాంశము.

**సృష్టికర్త అయిన దేవునికి మనలను సమర్పించడానికి లేదా ఆయనను తిరస్కరించడానికి మనకు ప్రతి ఒక్కరికి ఎంపిక చేసుకోవడానికి అవకాశము ఇవ్వబడుతున్నది.**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## రెండవ పాఠము : 2 & 3 అధ్యాయములు

**పాఠ్యంశ వాక్యము** : నిజమైన యూదుడు అనగా వినయపూర్వకమైన (కనికరము కలిగిన) మరియు పశ్చాత్తాపపడే హృదయముతో ఉన్న వ్యక్తి.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 2:1-8 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని యొక్క తీర్పు, ఇతరుల యెడల మనయొక్క తీర్పు ఎలా భిన్నముగా ఉంటుంది?

2. దేవుని దయ మనకు ఏమి చేయాలి/చేయును అని తెలియజేస్తున్నది?

3. దేవుని ఉగ్రత రావడానికి గల కారణము ఏమిటి (5 వ వచనము)?

4. పౌలు ఉన్న రోజుల నుండి నేటి వరకు మానవుని హృదయము మారిందని మీరు అనుకుంటున్నారా?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 2:9-29 వరకు అధ్యయనము చేయగలరు**

1. చెడు చేసేవారికి, మంచి చేసేవారికి ఫలితము ఏమిటి?

2. దేవుడు అభిమానమును (పక్షపాతమును) చూపిస్తాడా? ఒకరి కంటే మరొకరు ముఖ్యమా (11,12 వ వచనములు)?

3. ఎవరు నీతిమంతులుగా ప్రకటించబడతారు? వారు ధర్మ శాస్త్రము కలిగి ఉన్నారా లేదా అనే విషయము పట్టింపు ఉంటుందా లేదా?

4. దేవుని ధర్మశాస్త్రము ఎక్కడ వ్రాయబడినది (15 వ వచనము)?

5. సున్నతి దేనికి గుర్తుగా ఉన్నది?

**<u>మూడవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 3:1-24 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఎవరు అవిశ్వాసులు, ఎవరు విశ్వాసులు?

2. దేవుని ముందు ఎవరు నీతిమంతులు? దేవుని ఎవరు వెదుకుతారు? దేవునికి ఎవరు భయపడతారు?

3. దేవుని ముందు ఎవరు జవాబుదారీగా ఉంటారు?

4. 23 వ వచనాన్ని ఉపయోగించి, మీరు పాపమును ఎలా నిర్వచిస్తారు?

5. ఎఫెసీయులకు 2: 4-5 లో వివరించిన బహుమతి ఏమిటి? “కృప” అనే పదమును మీరు ఎలా నిర్వచిస్తారు?

**<u>నాలుగవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 3:25-31 వరకు అధ్యయనము చేయగలరు**

1. 1 యోహాను 1: 7 ప్రకారము, పాపమునకు చెల్లింపుగా ఏమి అవసరము? (లేవీయకాండము 17: 10-11 కూడా చూడగలరు)

2. యేసు మరణము బలుల యొక్క అవసరమును ఎలా నిలిపివేసినది? (హెబ్రీయులు 9: 11-12, 24-28 కూడా చూడగలరు)

3. దేవుని యెదుట ఎవరు నీతిమంతులుగా తీర్చబడుతారు?

4. దేవుని గురించి సిలువ మనకు ఏమి చూపిస్తుంది? (యోహాను 3:16 కూడా చూడగలరు)

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 2&3 అధ్యాయములు అధ్యయనము చేయగలరు**

1. దేవుని ముందు సరియైనవారిగా ఉండుటకు ప్రజలు ఈ రోజులలో ఏమి చేస్తున్నారు?

2. ఒక వ్యక్తి చేసేది (క్రియలు) ఏదైనా దేవుని ముందు సరియైనవాడిగా ఉండునట్లు చేయగలదా? (హెబ్రీయులు 11: 6, యెషయా 64: 6-7 కూడా చూడగలరు)

3. యేసు ఎందుకు వచ్చాడు, చనిపోయాడు, సమాధి చేయబడ్డాడు మరియు తిరిగి లేచాడు (రోమా 4:25) అని మీరు ఎవరికైనా వివరించగలరా?

**ఆరవ రోజు** :

రెండవ పాఠము : **"దేవుడు న్యాయవంతుడు - దేవుడు నమ్మకమైనవాడు"**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 2&3 అధ్యాయములు |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 3:11 "నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు" |
| **పాఠ్యాంశ వాక్యము** | నిజమైన యూదుడు అనగా వినయపూర్వకమైన (కనికరము కలిగిన) మరియు పశ్చాత్తాపపడే హృదయముతో ఉన్న వ్యక్తి. |
| **జీవిత సూత్రము** | మన పాపములకు యేసుక్రీస్తు పరిహారము చెల్లించాడు! |

**సారాంశము**:

మొదటి అధ్యాయములో 20-32 వచనములను వ్రాసినప్పుడు పౌలు అన్యజనులను మనస్సులో ఉంచుకున్నట్లు అనిపిస్తున్నది, కాని రెండవ అధ్యాయములో అతను తన మాటలను యూదులపై కేంద్రీకరించాడు అని గమనించవచ్చును. రెండవ అధ్యాయములో ప్రవేశపెట్టిన కఠినమైన వాస్తవము ఏమిటనగా, మానవాళి అంతా దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేస్తున్నారు మరియు అందువలన మనమందరము మరణమునకు అర్హులము అని చెప్పుచున్నది. మనలో ఎవరు కూడా మరొకరిపై తీర్పు ఇవ్వడానికి అర్హులు కాదు అని తెలియజేస్తున్నది. యూదులు మరియు అన్యజనులు దేవుని తీర్పులో ఉన్నారు. నిజమే, యూదా ప్రజలు కూడా దుర్మార్గము, కలహాలు, వంచన, ఒకరి మీద ఒకరు చెప్పుకొనుట మొదలైన వాటిలో పాల్గొంటున్నారు. యూదులు కూడా "చెడును కనిపెట్టినవారు" ... "కొండెగాండ్రు, అపవాదకులు, దేవద్వేషులు, హింసకులు, అహంకారులు, బింకములాడువారు, చెడ్డవాటిని కల్పించువారు, తలిదండ్రులకవిధేయులు, అవివేకులు" (1:30). యూదులు దేవుడు చేత ఎన్నుకున్న ప్రజలు మరియు ఆయన ధర్మశాస్త్రాన్ని కలిగి ఉన్నారు, కాని వారి సహజ

హృదయాలు అన్యజనుల మాదిరిగా ఒకరిపై మరొకరికి హాని చేయడము, అసూయ, కలహాలు మరియు చెడులతో నిండి ఉన్నాయి. అందరూ కూడా దేవుని ముందు దోషులుగా నిలుస్తారు.

"దేవుని అనుగ్రహము మనలను మారుమనస్సునకు ప్రేరేపిస్తున్నది", కాని దేవుని, అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘ శాంతమును మనము తృణీకరించాలేము(2: 4). అతడు అహంకారులకు వ్యతిరేకముగా ఉంటాడు, కాని దీనులకు కృప అనుగ్రహించును. స్వీయ కేంద్రీకృతము పాపమునకు మూలము మరియు ఇది సత్యాన్ని తిరస్కరించే మొదటి అడుగు. ప్రపంచము ముందు మనము ఎలా ఉంటున్నాము అని దేవుడు చూస్తున్నాడు. పూర్తి జ్ఞానముతో, దేవుడు మన పనులను, ఉద్దేశాలను గూర్చి తీర్పు తీర్చుతాడు (2: 2-8). దేవుడు హృదయాన్ని చూస్తాడు. యూదులు కలిగి ఉన్న సత్యము యొక్క జ్ఞానము వారిని రక్షించదు కాని, మారుమనస్సు మరియు రూపాంతర జీవితము 4-7 మాత్రమే రక్షించును. అతని తీర్పు మన హృదయములలో వ్రాయబడిన చట్టానికి లోబడి ఉంటుంది. మారుమనస్సు మాత్రమే దీనియొక్క ప్రతిస్పందనయై ఉంటుంది. మారుమనస్సు అనే పదము ఒక భావన లేదా మంచి ఉద్దేశ్యము కాదు. ఖచ్చితమైన చర్యలతో మనస్సులో నిర్ణయాత్మక మలుపు తిప్పే వైఖరి అనగా మన యొక్క పాపముల కొరకు ఒప్పింపబడి వాటిని వదిలి పెట్టి దేవుని చిత్తములో నడచుటయై యున్నది.

యూదుడు అనగా దేవుని యెదుట సరియైన హృదయము గల వ్యక్తి. మన నీతి గల న్యాయమూర్తి ఎదుట మనము ఎక్కడ నిలబడ్డామో ప్రతి ఒక్కరము పరిశీలించుకుందాము. మన క్రియలు, ప్రవర్తన మన హృదయములో ఉన్నదానికి సరిపోతాయా? మనము చేసేది ఎందుకు చేయాలి? మన రహస్యాలు కూడా తీర్పు తీర్చబడతాయి, కాబట్టి దేవుని యొక్క సత్యమును గమనించుటను వెదకుదాము. ఏదైనా స్వీయ ప్రయత్నము అనగా మనయొక్క ప్రయత్నము యేసుక్రీస్తుచే తీర్పు తీర్చబడుతుంది. యూదులు మరియు అన్యజనులకు ప్రమాణములు భిన్నముగా అనిపించినప్పటికీ, తీర్పు మాత్రము అదే అపరాధముగా ఉంటుంది! మీరు మార్చబడడానికి పరిశుద్ధాత్మకు ఏ ఏ విషయాలలో సమర్పించుకున్నారు? ఈ పాడైపోయిన లోకములో క్రీస్తు స్వరూపమును ధరించాలి, మన సాక్ష్యమునకు ఏదైనా ఆటంకముగా ఉన్నదా? మన హృదయము ఉద్దేశాలను మరియు కోరికలను మార్చగల శక్తిని పరిశుద్ధాత్మ మనకు అందిస్తుందని గుర్తుంచుకోవలయును.

## మన పాపములకు యేసుక్రీస్తు పరిహారము చెల్లించాడు!

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## మూడవ పాఠము : 4 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : మన విశ్వాసము యొక్క తండ్రియైన అబ్రాహాము, దేవుని యందు విశ్వాసము ఉంచుట ద్వారా మాత్రమే నీతి కలుగునని ఈ అధ్యాయము ఋజువు చేస్తున్నది.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 4:1-5 వరకు అధ్యయనము చేయగలరు**

1. యూదా దేశమునకు తండ్రి ఎవరు?

2. అబ్రాహాము గురించి పౌలునకు ఎలా తెలియును అని మీరు అనుకుంటున్నారు?

3. అబ్రాహామును నీతిమంతునిగా మార్చినది ఏమిటి?

4. మనము దేవుని వద్దకు ఎలా వస్తాము (గలతీయులు 2: 15-16 కూడా చూడగలరు)?

5. మనము మంచి పనులు ఎందుకు చేస్తాము (ఎఫెసీయులు 2: 8-10 కూడా చూడగలరు)?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 4:6-9 వరకు అధ్యయనము చేయగలరు**

1. దావీదు, ధన్యుడు అని మనకు ఏ మూడు విషయాలను తెలియజేసాడు?

2. కీర్తనలు 32: 1-5 నుండి, దావీదు చేసిన పాపములు క్షమించబడటానికి ఏమి చేసాడు?

3. క్షమాపణ యొక్క ఈ ఆశీర్వాదమును ఎవరు నమ్మగలరు?

4. అబ్రాహాము ఎప్పుడు నీతిమంతులుగా లెక్కించబడ్డాడు? సున్నతికి ముందా లేదా తరువాత ?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 4:10-12 వరకు అధ్యయనము చేయగలరు**

1. అబ్రాహాము సున్నతి అనగా ఏమిటి?

2. మన ఆత్మీయ తండ్రి ఎవరు?

3. శారీరకముగా అబ్రాహాము నుండి వచ్చినందున మేము రక్షింపబడతామని ఎవరు భావించారు?

4. అబ్రాహాము పిల్లలవలె మనకు అదే వాగ్దానము ఎలా వర్తిస్తుంది?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 4:13-18 వరకు అధ్యయనము చేయగలరు**

1. ధర్మశాస్త్రము మనకు ఏమి తెస్తుంది?

2. వాగ్దానము ఏమి తెస్తుంది?

3. అనేక దేశాలకు తండ్రి ఎవరు?

4. 17 వ వచనము ప్రకారము, దేవుడు ఏ ఏ విషయాలకు ప్రసిద్ధి చెందినాడు (1 కొరింథీయులు 1: 26-29 కూడా చూడగలరు)?

5. విశ్వాసులకు తండ్రియైన అబ్రాహాము సంతానముగా ఎవరైనా కాగలరా?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 4:19-25 మరియు ఆది కాండము 18:11-14 వరకు అధ్యయనము చేయగలరు**

1. అబ్రాహాముకు ఇస్సాకు జన్మించినప్పుడు అతని వయస్సు ఎంత?

2. కుమారుని గూర్చి దేవుడు ఇచ్చిన వాగ్ధానమును విశ్వసించే విశ్వాసము అబ్రాహామును బలహీనము చేసినదా? లేదా బలపరచినదా?

3. యేసును మృతులలోనుండి లేపినది ఎవరు (1 పేతురు 1:21 కూడా చూడగలరు)?

4. దేవుని వాగ్ధానములను నీవు నమ్ముతున్నావా?

5. మీ సమూహములోని ఇతరులను ప్రోత్సహించే విధముగా మీ వాగ్ధానమును మీరు పంచుకుంటారా?

**ఆరవ రోజు** :

మూడవ పాఠము : "**విశ్వాసము ద్వారా మాత్రమే నీతిమంతులముగా తీర్చబడుతాము**"

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 4 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 4:20-21 "అవిశ్వాసమువలన దేవుని వాగ్దానమునుగూర్చి సందేహింపక 21 దేవుని మహిమపరచి, ఆయన వాగ్దానము చేసినదానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలమునొందెను." |
| **పాఠ్యాంశ వాక్యము** | మన విశ్వాసము యొక్క తండ్రియైన అబ్రాహాము, దేవుని యందు విశ్వాసము ఉంచుట ద్వారా మాత్రమే నీతి కలుగునని ఈ అధ్యాయము ఋజువు చేస్తున్నది. |
| **జీవిత సూత్రము** | అసాధ్యమును సాధ్యము చేయగల దేవునిపై విశ్వాసమును ఉంచుటను బట్టి మనకు నిరీక్షణ కలుగుతుంది. |

**సారాంశము**:

అబ్రాహాము విశ్వాసుల తండ్రిగా పిలువబడ్డాడు, కాని అతను మొదట దేవునికి విధేయత చూపినప్పుడు అతనికి చాలా తక్కువ మాత్రమే తెలుసు. మనము అతని జీవితాన్ని గమనించినప్పుడు, మనకు అవసరమైన విశ్వాసమును చూస్తాము; అది క్రియల మీద ఆధారపడనిది లేదా ధర్మశాస్త్రమును పాటించనిది (ధర్మశాస్త్రము ఇవ్వబడలేదు) మరియు సున్నతి ఆధారముగా వచ్చినది కాదు. రక్షణ పొందిన తరువాత అతడు సున్నతి చేయబడ్డాడు (4: 10-12). విశ్వాసము ద్వారా

మాత్రమే రక్షణ మనకు వస్తున్నదని ఇది మనకు ఋజువు చేస్తున్నది; యూదులు మరియు అన్యజనుల కొరకును యిదియే వర్తిస్తున్నది.

అబ్రాహాము మరియు దావీదులను విశ్వాసము మరియు నీతిమంతులనుగా చేయుటను గూర్చి పౌలు పాత నిబంధనలో నుండి ఉదాహరణలుగా మనకు చూపించాడు. అబ్రాహాము ముందుకు చూస్తూ, భవిష్యత్తులో వచ్చే మెస్సీయ అయిన క్రీస్తును చూశాడు. అతను ఈ విషయమును గురించి దేవుణ్ణి నమ్మాడు మరియు విశ్వాసము ద్వారా నీతిమంతునిగా చేయబడ్డాడు. దావీదు కూడా దేవుణ్ణి నమ్మాడు మరియు నీతిమంతునిగా చేయబడ్డాడు. కీర్తనలు 32: 1-2 లో ఆయన ఇలా అన్నాడు, "తన అతిక్రమములకు పరిహారమునొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడు. యెహోవాచేత నిర్దోషి అని యెంచబడినవాడు ఆత్మలో కపటములేనివాడు ధన్యుడు." దేవునిపై నిరంతర విశ్వాసము ఉన్నప్పటికీ, ఈ మనుష్యులు ఇద్దరూ దేవుని గురించి అర్థము చేసుకోవడములో లేదా ఆయన మీద ఉంచిన విశ్వాసముతో ఆయనతో నడవడములో పరిపూర్ణముగా లేరు. అబ్రాహాము మరియు అతని భార్య శారా ఒక కుమారుని కొరకు దేవుని వాగ్దానమును విశ్వసించడములో విఫలమయ్యారు మరియు విషయాలను తమ చేతుల్లోనికి తీసుకున్నారు (ఆదికాండము 16:2-4). వ్యభిచారము మరియు హత్య రెండింటికీ దావీదు దోషి (2 సమూయేలు 11: 1-27) కానీ, ఈ మనుష్యులలో వైఫల్యాలు ఉన్నప్పటికీ దేవుడు వారి పట్ల నమ్మకముగా ఉన్నాడు. దేవుడు తన వాగ్దానములను వారిపట్ల జరిగించాడు.

చాలామంది క్రైస్తవులు అక్కడే ఆగిపోతున్నారు. రక్షణ అనునది నరకము నుండి తప్పించుకొని నిత్యజీవమునకు చేరుకోవడానికి ఒక మార్గము మాత్రమే అని వారు అనుకుంటారు, కాని దేవుని కృప చాలా ఎక్కువను అనుమతిస్తున్నది. మన విధేయత వలన మనము ధర్మశాస్త్రము నుండి విముక్తి పొందలేము. మనము విధేయతతో నడుచుకునేలా ధర్మశాస్త్రములో వెల్లడైన పాపము నుండి విముక్తి పొందాము. విశ్వాసము ద్వారా విధేయతతో నడవడము మన జీవిత యొక్క ఉద్దేశ్యము మరియు అర్థాన్ని ఇస్తున్నది.

## అసాధ్యమును సాధ్యము చేయగల దేవునిపై విశ్వాసమును ఉంచుటను బట్టి మనకు నిరీక్షణ కలుగుతుంది.

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## నాలుగవ పాఠము : 5 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : దేవుని ప్రేమ మనలను లోపలి నుండి బయటకు అనగా అంతరంగములో నుండి బాహ్యముగా మారుస్తుంది.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 5:1-2 వరకు అధ్యయనము చేయగలరు**

1. విశ్వాసము ద్వారా నీతిమంతులముగా తీర్చబడుట యొక్క ఫలితము ఏమిటి? (ఈ రెండు వచనములలో మూడు ప్రయోజనాలు ఉన్నాయని గమనించగలరు)

2. యేసుక్రీస్తు ప్రభువు దేవునితో ఈ సమాధానమును ఎలా తీసుకువచ్చాడు (హెబ్రీ 9:14)?

3. ఈ సమాధానము గురించి మీకు ఏమి అర్థమైనదో మీరు పంచుకొనగలరు?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 5:3-5 వరకు అధ్యయనము చేయగలరు**

1. క్లిష్ట పరిస్థితులలో మన వైఖరి ఎలా ఉండాలి? ఎందుకు?

2. ఇబ్బంది కరమైన, కష్ట సమయాల్లో ఇతరులు స్పందించే విధానముతో ఇది ఎలా సరిపోతుంది?

3. ఇబ్బంది కరమైన పరిస్థితులలో మనలో ఏమి కలుగును?

4. దేవుని ప్రేమను మనలో కుమ్మరించడములో ఎవరు పాల్గొంటారు?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 5:6-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. క్రీస్తు మనకోసము చనిపోయినప్పుడు మన పరిస్థితి ఏమిటి?

2. మనము దేని నుండి రక్షించబడ్డాము?

3. మనము ఇప్పుడు ఎందుకు సంతోషిస్తున్నాము?

4. దేవునితో సమాధానపడుటను నీవు ఎలా నిర్వచిస్తావు?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 5:12-17 వరకు అధ్యయనము చేయగలరు**

1. పాపము ప్రపంచములోనికి ఎలా వచ్చినది? (ఆదికాండము 3: 1-6 కూడా చూడగలరు)

2. మరణము మనుష్యులందరికీ ఎలా వ్యాపించినది? (1 కొరింథీ 15:22 & ఎఫెసీ 2: 3 కూడా చూడగలరు)

3. పౌలు ఇక్కడ ప్రస్తావించుచున్న ఉచిత బహుమతి ఏమిటి? (రోమా 5:21 & ఎఫెసీ 2: 8 కూడా చూడగలరు)

4. మనము ఈ జీవితంలో ఎలా జీవించగలుగుతాము? (2 కొరింథీ 4: 16-17 & ఎఫెసీ 1: 18-21 కూడా చూడగలరు)

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 5:18-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. అవిశ్వాసుల జీవితమును ఏది ఏలుచున్నది?

2. విశ్వాసుల జీవితమును ఏది ఏలుచున్నది?

3. ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశ్యము ఏమిటి? (రోమా 7: 7 కూడా చూడగలరు)

4. క్రీస్తు యేసు ద్వారా విమోచించబడుట అనగా ఏమిటి? (యోహాను 8: 31-36 కూడా చూడగలరు)

5. మీ నిత్యత్వము విషయములో దీని యొక్క అర్థము ఏమిటి?

**<u>ఆరవ రోజు</u>** :

నాలుగవ పాఠము : “**దేవుని ప్రేమ రూపాంతరము చెందించును**”

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 5 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 5:1 “కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి, మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునితో సమాధానము కలిగియుందము” |
| **పాఠ్యాంశ వాక్యము** | దేవుని ప్రేమ మనలను లోపలి నుండి బయటకు అనగా అంతరంగములో నుండి బాహ్యముగా మారుస్తుంది. |
| **జీవిత సూత్రము** | మన పాపము కన్నా దేవుని కృప చాలా గొప్పది. |

**<u>సారాంశము</u>**:

రోమా 5 వ అధ్యాయములో, యేసుక్రీస్తునందు విశ్వాసము ద్వారా విశ్వాసులు దేవునితో నీతిమంతులముగా తీర్చబడినప్పుడు వారికి లభించిన కొన్ని అధికారములను పౌలు వివరించాడు; దేవునితో సమాధానము, కృపలో ప్రవేశము, దేవుని మహిమలో ఒక భాగము, బాధ సమయాలలో ఆనందము మరియు దేవుని ఉగ్రత నుండి రక్షణ. మనము పిలువబడిన జీవితమును జీవించడములో గల బాధ్యతలు మరియు మనకు అందుబాటులో ఉన్న వనరులను కూడా అతను వివరించాడు. అన్ని విషయములలో, ఆత్మను (మన మనస్సు, మన భావోద్వేగాలు మరియు మన సంకల్పము) రక్షించడానికి దేవుడు పనిచేసే విధానమును పౌలు తెలియజేసాడు.

పౌలు ఆదాము మరియు యేసుక్రీస్తును, ఆదాములోని మనిషిని, క్రీస్తులో మనిషిని పోల్చాడు మరియు తేడాను తెలియజేసాడు. మానవుడు, ఆదాము నుండి జన్మించినాడు కావున పాపపు పాలనలో ఉన్నాడు. శరీరము మనలను ఏలుచున్నది. ఆదాము యొక్క జీవితము, దాని యొక్క అన్ని స్వీయ-కేంద్రీకృత లక్షణాలతో మనకు కలిగినది. స్వీయ-కేంద్రీకృత జీవితము ఆదాము నుండి పుట్టిన వారందరికీ జీవితములలో ఉండే సహజమైన మార్గము. మరియు, ఆదాములో, మనమందరము మరణానికి అర్హులైన పాపులము. కానీ సిలువపై క్రీస్తు మరణము, మనకు ఇక్కడ మరియు ఇప్పటి జీవితము మరియు శాశ్వతమైన జీవితము ఈ రెండింటి జీవితానికి అవకాశాన్ని తెచ్చిపెట్టినది. క్రీస్తుతో చేరిన తరువాత, మనము ఆదాములోని ఈ జీవితము నుండి నరికివేయబడి, పునరుత్థానుడైన క్రీస్తుతో అంటుకట్టబడి యున్నాము. ఆయన మరణము మనకు దేవునితో సమాధానమును తెచ్చిపెట్టినది మరియు పాపమునకు బానిసలమైన మనలను మరణింప

జేసినది. పాపము మరియు మరణము ద్వారా పరిపాలించబడటానికి బదులుగా, మనము దేవుని ప్రేమతో పాలించబడతాము మరియు అతని జీవములో మనము జీవిస్తున్నాము. పౌలు గలతీ 2: 20 లో చెప్పినట్లుగా, “నేను క్రీస్తుతోకూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నే నిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసమువలన జీవించుచున్నాను.”

మన ఆత్మ నీతిమంతులముగా చేయబడినప్పటికీ, పాపము యొక్క బానిసత్వము మరియు దాని పాలనలో జీవిస్తున్న ప్రాణముతో కొనసాగడము చాలా వరకు సాధ్యమే. ఆదాములో ఓటమి, దుఃఖము, బానిసత్వము మరియు అంధత్వము వంటి జీవితాన్ని గడపడానికి మనము ఎంపిక చేసుకోవచ్చును. వాస్తవానికి, క్రీస్తులో విజయము, మహిమ, ఆశీర్వాదము, సమాధానము మరియు ఆనందాన్ని కూడా మనము అనుభవించవచ్చును. ఆదాము మరియు క్రీస్తు మనము అనుసరించడానికి ఎంచుకునే ఉదాహరణలు మాత్రమే కాదు. వారు, మనలను తమ ప్రజలుగా కలిగి ఉన్న ప్రభువులు: ఒకరు నాశనము చేసే శక్తిని కలిగి ఉంటారు మరియు మరొకరు సత్యమైన, వాస్తవమైన జీవితాన్ని కాపాడటానికి మరియు రక్షణనిచ్చే శక్తిని కలిగి ఉంటారు.

ఒకప్పుడు పాపము మనలను మరణము వరకు పరిపాలించినప్పుడు, క్రీస్తు మనలను కొత్త జీవితములోకి పరిపాలించగలడు. ప్రస్తుతము, ఈ జీవితములో, మనము క్రీస్తులో విజయమును అనుభవించవచ్చును, పాతజీవితములో ఒకసారి ఆదాములో ఓటమిని మాత్రమే అనుభవించాము. మనము ఈ ప్రక్రియను నేర్చుకున్నప్పుడు, ఆదాములో చెడుగా ఉండటము కంటెను క్రీస్తులో మంచిగా ఉండటము చాలా సులభము. క్రీస్తు జీవితమును మనము ఎలా ఆచరణలో పెట్టాలో తెలుసుకోవడానికి కొంత సమయము పడుతుంది. మనము మొదట దానితో కష్టపడవచ్చును, కాని మనము ఆయనను విశ్వసించి, విశ్వాసము ద్వారా ఆయన నాయకత్వానికి ప్రతిస్పందిస్తున్నప్పుడు, లోబడుతున్నప్పుడు మన అడుగులు స్పష్టమవుతాయి.

15-18 వ వచనములలో, ఆదాము చేసిన పాపము **అందరిని** ప్రభావితము చేసిందని, విశ్వాసము ద్వారా క్రీస్తు నీతి **అందరికి** లభిస్తుందని పౌలు ప్రకటించాడు. సిలువపై క్రీస్తు యొక్క ప్రాయశ్చిత్తమయిన అతని రక్తము, ప్రతి ఒక్కరిని (**అందరిని**) రక్షించడానికి సరిపోతుంది, కాని విశ్వాసము ద్వారా అంగీకరించే వారికి మాత్రమే ఇది ప్రభావవంతముగా ఉంటుంది (ఎఫెసీ 2: 8-9). ఆయన యొక్క రక్షణ అనే బహుమతిని అంగీకరించడానికి మీరు విశ్వాసమును ఉపయోగించారా?

## మన పాపము కన్నా దేవుని కృప చాలా గొప్పది!

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## అయిదవ పాఠము : 6 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : క్రీస్తు రక్షణ కార్యము ద్వారా, మనము పాపము యొక్క శక్తి నుండి విముక్తి పొందాము.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 6:1-7 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుడు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో, క్షమిస్తున్నాడో చూపించడానికి మనము పాపము చేయుచూ ఉండాలా?

2. మనము క్రీస్తు నందు విశ్వాసముంచినప్పుడు మన పాపమునకు ఏమి జరుగుతుంది?

3. బాప్తిస్మములో చూసినట్లుగా మరణము నుండి జీవమునకు గల దశలను వివరించగలరు?

4. ఇది మీకు ఏ ప్రయోజనము మరియు వాగ్దానము చేయుచున్నది (7 వ వచనములో పేర్కొనబడినది)?

5. ఈ రోజు మీ యొక్క ఈ స్వేచ్ఛను ఎవరితోనైనా పంచుకోగలరు.

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 6:8-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. కొలొస్సయులకు 3: 1-17 నుండి, మన క్రొత్త జీవితములో మనము ఇప్పుడు ఏమి విసర్జించాము మరియు వేటిని ధరించాము?

2. క్రీస్తు మరణము మనలను దేని నుండి విడిపించినది?

3. మానవాళిని పాపము నుండి విడిపించడానికి యేసు ఎన్నిసార్లు మరణించాలి?

4. మనము మరణించడానికి ఏమి చేయవలయును మరియు మనము ఎవరి కొరకు జీవించాలి?

5. ఈ మార్పు గురించి 2 కొరింథీయులకు 5:17 ఏమి చెబుతున్నది?

6. ఇతరులు చూడగలిగే స్పష్టమైన మార్పులు  మీ జీవితములో ఏమి సంభవించాయి?

**<u>మూడవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 6:11-14 వరకు అధ్యయనము చేయగలరు**

1. యేసు సిలువ వద్ద ఏ శక్తి విరిగినది?

2. మీ జీవితముపై ఇప్పుడు ఎవరికి ఆధిపత్యము లేదా నియంత్రణ ఉన్నది?

3. ఇది మన జీవితములో ఒక సారి జరిగేదా లేదా మనము రోజు  రోజు మరణించవలసిన అవసరము ఉన్నదా?

4. మన జీవితములో పాపమును పరిపాలించడానికి మనము అనుమతిస్తే, ఏ ఏ ఫలితాలు వస్తాయి?

5. మీరు “ధర్మశాస్త్రము క్రింద” (దేవుని ఆమోదము పొందటానికి ప్రయత్నిస్తున్నారా) లేదా “కృప క్రింద” (క్రీస్తు సిలువపై చేసిన కార్యమును బట్టి) ఉన్నారా?

**<u>నాలుగవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 6:15-19 వరకు అధ్యయనము చేయగలరు**

1. మీరు “ధర్మశాస్త్రము క్రింద” ఉంటే, ఫలితము ఏమిటి?

2. మీరు “కృప క్రింద” ఉంటే, ఫలితము ఏమిటి?

3. క్రీస్తును అంగీకరించక ముందు రోమీయుల పరిస్థితి ఏమిటి?

4. వారు ఇప్పుడు దేని నుండి విముక్తి పొందారు?

5. మీ జీవితము మీకు ఒక క్రొత్త ప్రభువు మరియు యజమాని ఉన్నాడని చూపుచున్నదా?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 6:20-23 వరకు అధ్యయనము చేయగలరు**

1. అవిశ్వాసులను పాపమునకు ప్రేరేపించేది ఏమిటి (గలతీయులు 6: 8 చూడగలరు)?

2. క్రీస్తుకు విధేయత చూపించుట యొక్క ఫలము ఏమిటి (22 వ వచనము చూడగలరు)?

3. పాపము యొక్క ఫలితము ఏమిటి (23 వ వచనము)?

4. నిత్యజీవమనే బహుమతి మనకు దేనిని ఖర్చు చేసినది?

5. నిత్యజీవమనే బహుమతి దేవునికి దేనిని ఖర్చు చేసినది (కొలొస్సయులకు 1:22 చూడగలరు)?

**ఆరవ రోజు** :

అయిదవ పాఠము : “**పాపానికి చనిపోయామా?**”

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 6 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 6:23 “ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము, అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము.” |
| **పాఠ్యాంశ వాక్యము** | క్రీస్తు రక్షణ కార్యము ద్వారా, మనము పాపము యొక్క శక్తి నుండి విముక్తి పొందాము. |
| **జీవిత సూత్రము** | మనలను మనము క్రీస్తుకు నీతి సాధనములుగా అర్పించగలము! |

**సారాంశము** :

ఆరవ అధ్యాయము **శుద్ధీకరణ ప్రక్రియ** – యేసు లాగా మారడమును మనకు పరిచయము చేస్తుంది. యేసు మరణము ద్వారా దేవుడు మన కోసము చనిపోయాడని, మనము కూడా ఆయనతో మరణించామని పౌలు ప్రకటించాడు. 3 వ వచనము ఇలా చెబుతోంది, "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" మన పాత పాపపు స్వభావము ఆయనతో సమాధి చేయబడినది లేదా అతని మరణములోనికి "బాప్తిస్మము" పొందినది. ఆయన మృతులలోనుండి లేచినప్పుడు, ఆయన మనలను కూడా తిరిగి బ్రతికించాడు. తత్ఫలితముగా, మన పాత పాపపు స్వభావమునకు మనము చనిపోయాము, కాని క్రీస్తులో ఉన్న మన క్రొత్త స్వభావమునకు సజీవముగా ఉన్నాము. ఇవి లోతైన సత్యాలు! మనపై పాపము యొక్క శక్తి విచ్ఛిన్నమైనది మరియు క్రీస్తులో ఆనందించడానికి మనకు అద్భుతమైన కొత్త జీవితము ఇవ్వబడినది!

దేవుడు మనలను ఆదాము జీవితము నుండి విడిపించాడని మరియు క్రీస్తు జీవితముతో మనలను అంటుకట్టాడని ప్రకటించినప్పుడు, మనము వాస్తవికతగా దీనిని స్వీకరించాలి. మన భావములు, పరిస్థితులు భిన్నముగా ఉన్నప్పటికీ మనము ఈ సత్యానికి గట్టిగా హత్తుకోవాలి. మనము క్రీస్తుతో చనిపోయినట్లు మనకు అనిపించకపోవచ్చును. లోపల ఉన్న చెడు చాలా సజీవముగా ఉన్నట్లు మనకు అనిపించవచ్చును మరియు చెడు పనులు చేయడానికి మనపై ఆ చెడుకు కొంత నియంత్రణ కూడా ఉంటుంది. మనము జీవితములో వెతుకుతున్న దానిని కనుగొనలేమని, లేదా మన చుట్టూ ఉన్న వారు అనుభవిస్తున్న దానిని మనము కోల్పోతామని భయపడి, సంతృప్తి చెందని అనుభూతి చెందవచ్చును. కానీ, విశ్వాసము ద్వారా, మనము రోజువారీ ఒత్తిళ్లను మరియు ప్రలోభాలను ఎదుర్కొనవచ్చును మరియు మనకు అది అనిపించకపోయినా దేవుడు చెప్పిన దానిని నిజము, సత్యము అని చెప్పవచ్చు. మన జీవితము మన మారుతున్న భావాలపై ఆధారపడి ఉండదు, కానీ ప్రతి తరములో ఎప్పుడూ మారని మరియు ఒకేలా ఉండే దేవునిపై ఆధారపడి ఉంటుంది.

పాపమునకు మనపై అధికారము ఉందని సాతాను చెప్పేది పెద్ద అబద్ధము!. మనము ఎవరికి దాసులము అవుతామో లేదా లోబడుతామో ఎంచుకోవడానికి మనకు పూర్తి స్వేచ్ఛ ఉన్నది. మనము మన పాత యజమాని నుండి విముక్తి పొందాము మరియు ఇప్పుడు మంచి మరియు సత్యము యొక్క క్రొత్త యజమానికి సేవ చేస్తున్నాము. 12 వ వచనము ప్రకారము, పాపము మనలను నియంత్రించనివ్వకూడదు, దానికి మనము లొంగకూడదు. ప్రతిరోజూ ఉదయాన్నే మనము మనలను ఆత్మ నియంత్రణకు నూతనముగా ఇవ్వవలయును. 22 వ వచనము చెప్పినట్లుగా, "మనము ఇప్పుడు పాపము నుండి విమోచించబడి మరియు దేవునికి దాసులమై ఉన్నాము". ఆయన చెప్పేది నిజమని మనము నమ్ముతామా? మనము అలా చేస్తే, అది సత్యమని, నిజమని త్వరలో కనుగొంటాము మరియు మనము పూర్తి స్వేచ్ఛలోకి తీసుకురాబడతాము. మన జీవితములో పాపము యొక్క ప్రాంతాలను చూడటానికి మరియు ఈ పాపముల నుండి పూర్తిగా విమోచించబడటానికి క్రీస్తు మనలో ఎలా పని చేయాలనుకుంటున్నారో మనకు చూపించడానికి పరిశుద్ధాత్మను మనము అడుగవలయును మరియు పరిశుద్ధాత్ముని యొక్క  సహాయమును తీసుకొని ముందుకు వెళ్ళవలయును.

**మనలను మనము క్రీస్తుకు నీతి సాధనములుగా అర్పించగలము!**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## ఆరవ పాఠము : 7 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : మనము పాపమునకు చనిపోయాము, కాని దేవుని కొరకు సజీవముగా ఉన్నాము.

**మొదటి మరియు రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 7:1-6 మరియు ఎఫెసీ 2:1-5 వరకు అధ్యయనము చేయగలరు**

1. పురుషుడు లేదా స్త్రీ పై ధర్మశాస్త్రమునకు ఎంతకాలము అధికారము ఉన్నది?

2. మనము ధర్మశాస్త్రము నుండి ఎలా విముక్తి పొందాము?

3. మనము దేవునికి చెందినవాళ్ళము మరియు ధర్మశాస్త్రము నుండి విడుదల చేయబడిన తరువాత ఇప్పుడు మన కొత్త ఉద్దేశ్యము ఏమిటి?

4. మనము ధర్మశాస్త్రమునకు లోబడి ఉన్నప్పుడు మన పాపపు స్వభావము ఏ ఏ ఫలములను ఇచ్చినది?

5. ఈ క్రింది వచనముల నుండి, మనము ఇప్పుడు ఏ ఏ ఫలములను ఫలింపవలయును:

a. గలతీయులకు 5: 22-23

b. ఎఫెసీయులకు 5: 9

c. యోహాను 4: 27-39

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 7:7-13 వరకు అధ్యయనము చేయగలరు**

1. ధర్మశాస్త్రము మన కోసము ఏమి చేస్తుంది?

2. ధర్మశాస్త్రము మరియు దాని అవసరతలను ఎవరు నెరవేర్చారు (మత్తయి 5: 17-20 చూడగలరు)?

3. పాపముతో మనము ఎదుర్కొంటున్న పోరాటములను ఎవరు అర్థము చేసుకుంటారు (హెబ్రీయులు 2: 14-18 చూడగలరు)?

**<u>నాలుగవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 7:14-24 వరకు అధ్యయనము చేయగలరు**

1. ప్రతిరోజూ మన శరీరముతో మనము ఎదుర్కొంటున్న పోరాటము ఏమిటి?

2. పాపము యొక్క మోసము యొక్క ఫలితము ఏమిటి?

3. పాపముపై విజయము సాధించిన ఫలితము ఏమిటి (25 వ వచనము)?

**<u>అయిదవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 7:22-25 మరియు ఎఫెసీ 4 వ అధ్యాయము అధ్యయనము చేయగలరు**

1. పోరాటము ఎక్కడ జరుగుతుంది?

2. మనము ఈ పోరాటములో ఎలా పోరాడతాము (2 కొరింథీయులు 10: 1-5 చూడగలరు)?

3. ఎవరి సహవాసము మనలను పాపము యొక్క శక్తి నుండి విడిపిస్తుంది?

4. ప్రతి రోజు మన జీవితమును (క్రొత్త స్వభావాన్ని) పునరుద్ధరించడములో చేసిన సహాయమునకు దేవునికి కృతజ్ఞతలు చెప్పవలయును.

**ఆరవ రోజు** :

ఆరవ పాఠము : **"దేవుని ఉద్దేశ్యముల కొరకు జీవించవలయును"**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 7 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 7:4 "కావున నా సహోదరులారా, మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలోనుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరముద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి." |
| **పాఠ్యాంశ వాక్యము** | మనము పాపమునకు చనిపోయాము, కాని దేవుని కొరకు సజీవముగా ఉన్నాము. |
| **జీవిత సూత్రము** | ప్రతిరోజు స్వయముగా మరణించడము రూపాంతరమును మరియు స్వేచ్ఛను తీసుకొస్తున్నది. |

**సారాంశము** :

7 వ అధ్యాయములో, పౌలు మన పాత స్వభావము పాపానికి చనిపోవడమే కాదు, మంచి పనులకు కూడా చనిపోయిందని వివరించాడు. మన శరీరములో, దేవునికి నచ్చే ఫలాలను మనము ఫలించలేము అని తెలియజేసాడు.

మనము క్రైస్తవులుగా మారడానికి ముందే, మన సహజ జీవితములోని (శరీరము) కొన్ని అంశములు చెడ్డవి, మరియు అవి మనలను ఇబ్బందులలోనికి నెట్టివేస్తాయని మనము అర్థము చేసుకున్నాము. స్వార్థము చెడ్డదని మనకు తెలుసు. లైంగికపాపము చెడ్డదని మనకు తెలుసు. దొంగిలించడము మరియు అబద్ధములు చెడ్డవని మనకు తెలుసు. ఈ విషయములు శరీరము నుండి వచ్చాయి మరియు శరీరము యొక్క పనులు చెడ్డవని మనము అర్థము చేసుకున్నాము. కాబట్టి, ఈ చెడు ప్రవర్తనలను ఆపడానికి మనము పని చేయవచ్చును, కానీ ఇది ఏమాత్రము నీతి కాదు, మన క్రైస్తవ జీవితములో ఇది మనకు అర్థాన్ని మరియు ఉద్దేశ్యాన్ని కూడా అందించదు. పాపము మనలో నుండి నిర్మూలించబడినప్పుడు, శూన్యత మిగిలిపోతుంది, అది దైవభక్తిగల, ఉద్దేశపూర్వకమైన జీవితముతో నిండి ఉండాలి.

మనము చెడుగా ధృవీకరించిన విషయాలపై విజయము సాధించడము ఎలా నేర్చుకున్నా, మనము ఇంకా బానిసత్వములో ఉన్నాము. మన క్రైస్తవ అనుభవములో మనము వెతుకుతున్న శక్తి ఇప్పటికీ మనకు లేదు. దీనికి తప్పు ఏమిటి ? అనగా మనము ఇంకా నేర్చుకోని విషయము ఏమిటనగా, మనము శరీరము యొక్క "మంచి" అని పిలవబడేదిగా ఉంది కాని ఇది వాస్తవానికి "చెడు" చెడ్డది. స్వీయ ప్రయత్నము, దేవుడి కోసము ఏదైనా చేయటానికి ప్రయత్నించడము లేదా మనము దేవుని కోసము చేసే పనుల ద్వారా మనకోసము కొంత పురోగతి పొందడము వంటివి "చెడ్డ" విషయాల మాదిరిగానే చెడ్డవి. చివరికి మనము దేవుని కోసము ఏమి చేయలేమని, కాని ఆయన మన ద్వారా అన్నిటినీ చేయగలడని తెలుసుకున్నప్పుడు, అప్పుడు మనము విమోచనలోకి వస్తాము (ఫిలిప్పీ 4:13). పౌలు ఈ సాక్షాత్కారాన్ని రోమా 7: 24-25లో ప్రకటించాడు, "అయ్యో, నేనెంత దౌర్భాగ్యు డను? ఇట్టి మరణమునకు లోనగు శరీరమునుండి నన్నెవడు విడిపించును?। మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. కాగా మనస్సు విషయములో నేను దైవనియమమునకును, శరీర విషయములో పాపనియమమునకును దాసుడనై యున్నాను." మన మనస్సు, భావోద్వేగము మరియు సంకల్పము యేసుక్రీస్తు నియంత్రణలోనికి తీసుకురాబడినప్పుడు, ఆయన మహిమాన్వితమైన, విజయవంతమైన

శక్తితో మనము నెరవేరవచ్చును. ఆయన మాత్రమే మన ఆత్మను నరకపు అగాధము నుండి రక్షించగలడు మరియు మన ఆత్మలను కూడా శుద్ధి చేయగలడు.

మనము మన నమ్మకాన్ని ఎక్కడ ఉంచాము? మన క్రొత్త జీవితము కోసం క్రీస్తుపై ఆధారపడటానికి మరియు ఆనుకొనడానికి బదులుగా మనము మన స్వంత బలము మీద ఆధారపడుతున్నామా? మత్తయి 11: 29-30లో యేసు చెప్పినదానిని పరిశీలించుదాము. “నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీమీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చు కొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి.” ఈ విషయమును “కృప” అని పిలుస్తారు. ఒకసారి మన మీద మనము విశ్వాసము కోల్పోయి, దేవునిపై మన పూర్తి విశ్వాసము ఉంచిన తరువాత, మనము కృప పొందవచ్చును. మనకు ఇవ్వబడిన సమయము, ప్రతిభ మరియు వనరులతో, దేవుని కృప అనుమతించే పనులను మనము చేయవచ్చును. ఆ కృపను పొందాలంటే, మనకు మనము చనిపోయి ఆయనకు లోబడి జీవించాలి, ఆయన పాదాల వద్ద కూర్చుని ఆయన మాటలు వినాలి. ఆయన పరిశుద్ధాత్మ విశ్వాసులమైన మనలో నివాసము ఏర్పరచుకొని, మనతో అన్ని సమయాలలో ఉంటాడు. అతను ఎప్పుడూ దాగుకోడు, ఎప్పుడూ విసుగు చెందడు, ఎప్పుడూ అందుబాటులో లేకుండా ఉండడు, నిశ్శబ్దముగా ఉండడు. మరియు ఆయన మన ద్వారా జీవిస్తున్నప్పుడు, ఆయన కృప తీపి సుగంధముగా మారుతుంది, అది రక్షింపబడుతున్నవారికి మరియు నశించిపోతున్నవారికి మన ద్వారా చూపబడుతుంది. (2 కొరిం 2:15) ఈ భూసంబంధమైన నడక, యాత్రలో ప్రతిరోజు ఈ కృప మనకు సరిపోతుంది.

## ప్రతిరోజూ స్వయముగా మరణించడము రూపాంతరమును మరియు స్వేచ్ఛను తీసుకొస్తున్నది.

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## ఏడవ పాఠము : 8 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : మన నిరీక్షణ పరిస్థితులపై లేదా ప్రజలపై కాదు, మన సర్వశక్తిమంతుడైన మరియు అత్యధికమైన ప్రేమ గలవాడైన దేవునిపైనే ఉంటుంది.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 8 వ అధ్యాయము మరియు 8:1-4 వరకు అధ్యయనము చేయగలరు**

1. రోమా 8 వ అధ్యాయములో పౌలు "నిరీక్షణ" అనే పదాన్ని ఎన్నిసార్లు ఉపయోగించాడు?

2. శిక్షావిధియు లేకుండా ఎవరు ఉన్నారు?

3. పాపమరణముల నియమము (2-3 వచనాలు) నుండి మనము ఎలా విముక్తి పొందాము?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 8:5-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. శరీర స్వభావము గల మనిషికి, ఆత్మీయ స్వభావము గల మనిషికి మధ్య తేడా ఏమిటి?

2. ఈ రెండు జీవన విధానాల ఫలితము ఏమిటి?

3. శరీరానుసారమైన మనస్సును వివరించగలరు (7-8 వచనములు).

4. దేవుని బిడ్డ యొక్క అంతరంగములో తేడాను ఎవరు చేస్తారు?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 8:9-17 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఆత్మ చేత ఎవరు నడిపించ బడతారు?

2. పరిశుద్ధాత్ముడు ఎలా వర్ణించబడ్డాడు ?

3. పరిశుద్ధాత్మతో మనకున్న సంబంధమును గురించి యోహాను 14: 16-17లోని వచనాలు మనకు ఏమి చెబుతున్నాయి?

4. పాపపు స్వభావము ప్రకారము జీవించడము వలన ఎలాంటి ఫలితాలు వస్తాయి?

5. ఆత్మ ద్వారా జీవించడము వలన ఎలాంటి ఫలితాలు వస్తాయి?

6. పాతదైన దాస్యపు ఆత్మ (15 వ వచనము) నుండి ఏ ఫలితాలు వస్తాయి?

7. నూతనమైన దత్తపుత్రాత్మ నుండి మనకు ఏమి ఫలితాలు వస్తాయి?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 8:18-25 వరకు అధ్యయనము చేయగలరు**

1. 2 కొరింథీయులకు 11: 23-27 ప్రకారము, ఈ అధ్యాయము వ్రాసేటప్పుడు పౌలు అప్పటికే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు?

2. పౌలు ఈ కష్టాలను తన భవిష్యత్తుతో ఎలా పోల్చాడు?

3. క్రీస్తు తిరిగి వచ్చే ఈ భవిష్యత్తు రోజు కోసము ఎవరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు?

4. ఆదికాండము 3: 17-19 ప్రకారము, ఆదాము హవ్వలు దేవునికి అవిధేయత చూపినప్పుడు మానవునికి, సృష్టికి ఏమి జరిగినది?

5. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు మనకు ఏయే ఆశీర్వాదములు పూర్తవుతాయి?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 8:26-39 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని ప్రజలు ఎవరికి తెలుసు మరియు వారి బలహీనతలలో ఎవరు ప్రార్థిస్తారు?

2. విశ్వాసుల కొరకు ప్రార్థన ఎలా చేయాలో ఆత్మకు ఎలా తెలుసు?

3. మన కొరకు ఆయన చేసిన ప్రార్థనలకు పరిశుద్ధాత్మకు ధన్యవాదాలు తెలుపుదాము

4. దేవుడు మన కొరకు యేసు ద్వారా చేసిన వాటిని ఏ పదములు వివరించాయి?

5. దేవుడు మనపక్షముననుండగా మనకు విరోధియెవడు (కీర్తన 37:12, 1 పేతురు 5: 8, రోమా 7: 5 చూడగలరు)?

6. ఆయన ప్రేమ నుండి మనలను వేరు చేయలేని విషయాల జాబితాను వ్రాయగలరు (38-39)?

7. మీకు సహాయము చేసిన మరియు ఇతరులకు కూడా సహాయపడే వాగ్దానమును మీరు మాతో పంచుకోగలరా?

**<u>ఆరవ రోజు</u>** :

ఏడవ పాఠము : **"నిరీక్షణ సర్వశక్తిమంతుడైన, అత్యధికమైన ప్రేమ గలవాడైన దేవునిపైనే ఉంటుంది"**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 8 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 8:38-39 "మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింపబడిన మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను." |
| **పాఠ్యాంశ వాక్యము** | మన నిరీక్షణ పరిస్థితులపై లేదా ప్రజలపై కాదు, మన సర్వశక్తిమంతుడైన మరియు అత్యధికమైన ప్రేమ గలవాడైన దేవునిపైనే ఉంటుంది. |
| **జీవిత సూత్రము** | మనకు ఏ శిక్షావిధియు లేదని, మరియు దేవుని శాశ్వతమైన ప్రేమలో స్వేచ్ఛగా మరియు భద్రముగా ఉండుటకు ఎన్నిక చేయబడిన వారమని నమ్ముచున్నాము! |

**సారాంశము** :

ఇక్కడ 8 వ అధ్యాయములో, పౌలు మన కొరకు మరియు లోపల దేవుని పని గురించి తన చర్చను పూర్తి చేశాడు. మనము ఈ జీవితములో ఉన్నప్పుడు, ఈ శరీరము విడిపించబడదు. కానీ వాస్తవము ఏమనగా మన ఆత్మ నీతిమంతుడిగా చేయబడినదని మరియు మన ప్రాణము శుద్ధీకరణ చేయబడుతుంది కావున దేవుడు ఒక రోజు ఈ శరీరాన్ని కూడా విమోచిస్తాడు (మహిమపరుస్తాడు) (8:11). మనము చివరికి క్రీస్తు సన్నిధిలోనికి ప్రవేశించినప్పుడు, మనము ఆయన ముందు పరిపూర్ణముగా (శరీరము, ఆత్మ మరియు ప్రాణము) నిలబడతాము!

మనలో దేవుని ప్రయోజనాలను నెరవేర్చడానికి పరిశుద్ధాత్మ యొక్క శక్తి మన క్రొత్త జన్మతోనే మొదలై శాశ్వతము వరకు కొనసాగుతుంది. మనకు క్రొత్త స్వభావము, లోపలి నుండి ఒక కొత్త శక్తి, జీవించడానికి మన ఉద్దేశాలను మార్చే ఒక క్రొత్త బాధ్యత, మరియు దేవునితో తన పిల్లలుగా ఒక క్రొత్త సంబంధముగా అతని కుటుంబములోనికి స్వీకరించబడినది. 12 వ వచనములో, ఈ సత్యము శరీరానుసారముగా జీవించడము కంటే దేవుని ఆత్మ ప్రకారము జీవించమని ఖచ్చితముగా అజ్ఞాపించినట్లు పౌలు తెలియజేసాడు. మన మనస్సును మనకు మరణాన్ని తెచ్చే శారీరక కోరికల కంటే మనకు జీవితాన్ని మరియు సమాధానమును తెచ్చే ఆత్మ యొక్క విషయాలపై, దృష్టి కేంద్రీకరించినప్పుడు మనము ఆత్మ ప్రకారము నడుస్తాము. ఆత్మ మన జీవితాలను నడిపించగలదనే వాస్తవము ఏమనగా మనము దేవుని పిల్లలు అని ధృవీకరించడము మరియు మనము ఆయన నాయకత్వాన్ని అనుసరించుట ద్వారా, మనలో ఆయన పనిని నెరవేర్చడానికి ఆయనను అనుమతిస్తాము. వాస్తవానికి, మన స్వంత కోరికల ద్వారా మనము నడిపించవచ్చును. మనము దేవుని ఆత్మను దుఃఖపరుస్తాము మరియు ఆర్పుతాము (ఎఫెసీ 4:30 మరియు 1 థెస్స 5: 19), కాని మనలో నివసించే ఆత్మ నిరంతరము మాట్లాడుతుంది. దేవుడు మన తండ్రి అని మరియు మనపై ప్రేమను కలిగి ఉన్నాడని ఇది ఋజువు, ఆయన సన్నిధి నుండి మనలను ఎప్పటికిని వేరు చేయదు (16 వ వచనము).

ఈ ప్రస్తుత శరీరములో జీవించడము భారమే. పాపాత్మకమైన ప్రలోభాలతో పోరాడటము అంత సులభము కాదు. శ్రమలు, పరీక్షలు మరియు హింస సమయములలో భరించడము బాధాకరమైనది మరియు ఇవి నిరుత్సాహపరుస్తాయి, కాని పౌలు 18 వ వచనములో "మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమయెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను." అని ప్రకటించాడు. అన్ని విషయాల పూర్తి పునరుద్ధరణ కోసము మనము సృష్టితో పాటు వేచి

ఉన్నాము (19-22). మన యొక్క ఆనందాన్ని దొంగిలించే చాలా విషయాలు ఉన్నాయి, కాని దేవుని ప్రేమ అందరికంటే, అన్నింటికంటే గొప్పది. మన బాధ దేవుని మంచితనముపై అపనమ్మకము కలిగించడానికి లేదా మన పట్ల ఆయనకున్న శ్రద్ధను ప్రశ్నించడానికి కారణము కావచ్చు, కాని మన ఆసక్తి అన్నింటికంటే కూడా మనము దేవుని హృదయములో మరియు దేవుని చేతిలో ఉందని మనకు గుర్తు చేయబడుతుంది. ఆయన ప్రేమను నమ్మడానికి మనము ఎక్కడ కష్టపడతాము? హృదయ వేదనలు, అన్యాయములు లేదా జవాబు లేని ప్రశ్నలు మనకు దేవుని సందేహములతో మరియు మన పట్ల ఆయనకున్న ప్రేమతో నిండిపోయాయా? మనము మన హృదయములోని ఆ ప్రదేశములను స్వస్థత చేయమని అడుగవలయును, అతను స్వస్థపరుస్తాడు మరియు మన కొరకు ప్రార్థిస్తాడు!

**మనకు ఏ శిక్షావిధియు లేదని, మరియు దేవుని శాశ్వతమైన ప్రేమలో స్వేచ్ఛగా మరియు భద్రముగా ఉండుటకు ఎన్నిక చేయబడిన వారమని నమ్ముచున్నాము!**

## రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

### ఎనిమిదవ పాఠము : 9 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : దేవుడు తన సార్వభౌమత్వము ద్వారా, దేవుడు తనకొరకు ప్రజలను ఎన్నుకుంటాడు.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 9:1-5 వరకు అధ్యయనము చేయగలరు**

1. సువార్తను గురించి ఇశ్రాయేలు యొక్క ప్రతిచర్య గురించి పౌలు భావించినప్పుడు అతని భావోద్వేగములను వివరించగలరు

2. యెషయా 53: 6-8 నుండి, మనయెడల యేసు యొక్క ప్రేమ ఎలా ఉంటుంది?

3. దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన ఆధిక్యతలను జాబితా చేయగలరు

4. ఈ ఆధిక్యతలు మరియు వాగ్దానములు మనకు ఏమి ఉన్నాయి (ఎఫెసీయులు 2: 14-22 కూడా చూడగలరు)?

5. మనము ఇశ్రాయేలు నుండి రాకపోతే ఏవిధముగా అబ్రహాము సంతానములో ఒకరుగా ఉన్నాము?

6. దేవుడు మనకు ఇచ్చిన బహుమతులకు ధన్యవాదములు తెలియజేయుము.

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 9:6-16 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని పిల్లలు ఎవరు?

2. వాగ్ధానము చేసిన పిల్లలు ఎవరు?

3. దేవుడు న్యాయవంతుడా?

4. మనము దేవుని దయ క్రింద ఉన్నామా లేదా మన స్వంత మానవ ప్రయత్నములో ఉన్నామా?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 9:17-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుడు తన మహిమ కొరకు ఫరోను ఎలా ఉపయోగించాడు?

2. కుమ్మరి ఎవరు మరియు మట్టి ఎవరు?

3. దేవుని స్వభావమును, నిర్ణయములను ప్రశ్నించడమును గురించి పౌలు ఏమి చెప్పాడు?

4. దేవుడు తన మహిమ కొరకు మిమ్ములను ఉపయోగించడానికి మీరు అనుమతిస్తారా?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 9:22-26 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ వచనములలో దేవుడిని ఏ పదములు వర్ణించాయి?

2. దేవుడు తనకొరకు పిలుస్తున్నాడని హోషేయ ఎవరి గురించి చెప్పారు?

3. దేవుడు వారిని (మీరు/నీవు) ఏ పేరుతో పిలుస్తాడు?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 9:27-33 వరకు అధ్యయనము చేయగలరు**

1. సముద్రపు ఇసుక లేదా ఆకాశములోని నక్షత్రములుగా ఉన్న చాలా మందిలో, ఎంతమంది రక్షింపబడతారు?

2. యెషయా చెప్పిన వాటిని ప్రస్తావిస్తూ, ఇశ్రాయేలు తిరస్కరణను దేవుడు ఎలా వర్ణించాడు?

3. “అడ్డురాతి, లేదా అడ్డుబండ” ఎవరు?

4. ఈ అధ్యాయములో ఏ వాగ్దానము ముగుస్తుంది?

**ఆరవ రోజు** :

ఎనిమిదవ పాఠము : **“అధికృత మరియు వాగ్దానము కలిగిన ప్రజలు ఒక ఉద్దేశ్యము కొరకు జీవిస్తారు”**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 9 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | యెషయా 55:8 “నా తలంపులు మీ తలంపులవంటిని కావు మీ త్రోవలు నా త్రోవలవంటిని కావు ఇదే యెహోవా వాక్కు” |
| **పాఠ్యాంశ వాక్యము** | దేవుడు తన సార్వభౌమత్వము ద్వారా, దేవుడు తనకొరకు ప్రజలను ఎన్నుకుంటాడు. |
| **జీవిత సూత్రము** | తనను పిలిచిన ఎవరినైనా క్రొత్త జీవితముతో ఆశీర్వదించడానికి దేవుడు సిద్ధముగా ఉన్నాడు. |

**సారాంశము** :

ఒక ముఖ్యమైన ప్రశ్నపై పౌలు బోధిస్తున్నాడు ఇక్కడ ఈ తొమ్మిదవ అధ్యాయములో సమాధానము ఇవ్వబడినది. “మరియొకరు కాకుండా నేనే క్రీస్తు శరీరములో ఎందుకు ఉన్నాను?” అతను దుఃఖమును మరియు వేదనను వ్యక్తపరచడము ద్వారా ప్రారంభిస్తూ మరియు దేవుని సార్వభౌమత్వాన్ని నమ్మకముగా గుర్తుచేస్తున్నాడు.

పౌలు తన తోటి యూదుల పట్ల తన ఉద్రేకపూర్వక హృదయాన్ని వ్యక్తము చేస్తున్నాడు. వాస్తవానికి, అతను తన ప్రజలు విముక్తిని పొందటానికి తన విముక్తిని ఇష్టపూర్వకముగా త్యాగము చేస్తానని చెప్పేంతవరకు వెళ్ళాడు (9: 3). పౌలు యొక్క వాదనలో అతిశయోక్తి లేదు, ఎందుకనగా అతను తన తోటి యూదుల చేతిలో పదేపదే తిరస్కరణ, అపవాదులు, ఆరోపణలు మరియు దెబ్బలు తినడము వంటివి ఎదుర్కొన్నాడు (2 కొరింథీయులు 11: 24-25). వారు తమయెడల ఉన్న దేవుని ప్రణాళిక మరియు వాగ్దానములలో తమ స్థానాన్ని చూడాలని అతను కోరుకుంటున్నాడు. మన శత్రువులను, మనలను బాధించేవారిని మనము ప్రేమిస్తాము అని దేవుడు మాత్రమే ఇవ్వగల ప్రేమకు పౌలు గారి జీవితమే ఉదాహరణ. ఈ ప్రేమ సహజముగా ఏమాత్రము రాదు. ఇది దేవుని నుండి మాత్రమే వచ్చిన అతీంద్రియ బహుమతి. మిమ్ములను బాధపెట్టిన వారి పట్ల మీకు అవసరమైన హృదయ మార్పు కొరకు ప్రార్థించగలరు. దేవుడు మన హృదయ గాయములను సున్నితముగా నయము చేస్తాడు.

4-5 వచనములలో పౌలు ఒక యూదా వ్యక్తిగా వచ్చిన అనేక ఆశీర్వాదములను పేర్కొన్నాడు. దేవుడు ఐగుప్తు నుండి వారిని రక్షించినప్పుడు ఇశ్రాయేలీయులను దేవుని దత్తత తీసుకున్నవారుగా అయ్యారు. ఇశ్రాయేలు ఒడంబడికలను అందుకుంది, అందులో ప్రభువు వారిని రక్షిస్తానని వాగ్దానము చేశాడు. దేవుడు తన ప్రజలకు సీనాయి పర్వతము వద్ద తన ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు, మోషే ధర్మశాస్త్రములో వారు ఎలా ఆరాధన చేయాలో సూచించాడు మరియు వారి రక్షణ

వాగ్దానములను వారికి ఇచ్చాడు. అయినప్పటికీ, అబ్రాహాము పిల్లలు అందరూ దేవుని పిల్లలు కాదని, దేవుని వాగ్దాన ఫలితముగా విశ్వాసము ద్వారా జన్మించిన వారు మాత్రమే అని పౌలు స్పష్టము చేస్తున్నాడు. “శరీరసంబంధులైన పిల్లలు”, అబ్రహాము పిల్లలు (యూదులు) మరియు “వాగ్దానము చేసిన పిల్లలు” యేసు క్రీస్తుపై విశ్వాసము ద్వారా దేవున్ని విశ్వసించేవారు ఉన్నారు (9: 6-8).

9: 9-29 వచనములలో, పౌలు చాలా కష్టమైన సందేశాన్ని ఇచ్చాడు. దేవుడు నీతిమంతుడు మరియు అతను ఒక వ్యక్తిని మరియొక వ్యక్తి మీద దీర్ఘశాంతముతో చివరి వరకు ఓపికపట్టగలడు (22 వ వచనము). “కావున ఆయన ఎవనిని కనికరింప గోరునో వానిని కనికరించును; ఎవని కఠినపరచ గోరునో వాని కఠిన పరచును.” (9:18) ఆయన యాకోబును ఏశావు మీద ఎన్నుకున్నాడు. ఆయన ఫరో హృదయాన్ని కఠినతరము చేశాడు. మరియు, దేవుడు ఇశ్రాయేలు ప్రజలను తన దయ మరియు సువార్తను ప్రపంచానికి తీసుకువెళతారని భూమి ప్రజలందరి నుండి ఎన్నుకున్నప్పటికీ, అతను ప్రతి ఒక్కరినీ రక్షణకు ఎన్నుకోలేదు. “ఇశ్రాయేలు కుమారుల సంఖ్య సముద్రపు ఇసుకవలె ఉండినను శేషమే రక్షింపబడుతుంది.” (9:27) ఇవి అర్థము చేసుకోవటానికి కష్టమైన పదములు, కాని మనకు తెలిసిన మరియు అర్థము చేసుకునే ఒక విషయము ఏమిటంటే, సృష్టిపై దేవుడు సార్వభౌమత్వాన్ని కలిగి యున్నాడు. “నేను కలిగి ఉంటాను ...” ఈ అధ్యాయములో చాలాసార్లు చెప్పబడినది, దేవుడు రాజుల మరియు వారి హృదయాలపై నియంత్రణ కలిగి ఉన్నాడని గుర్తుచేస్తున్నది. సృష్టించబడినవి అన్నియు ఒక్కొక్కటి ఎలా తయారవుతుందో ప్రశ్నించనందున, ఇలా ఎందుకు అని మనము దేవుడుని ఏమియు ప్రశ్నించలేము (యిర్మీయా 18: 1-6).

ఈ అధ్యాయము, యేసు క్రీస్తు అయిన అడ్డు రాయి తగిలి తొట్రు పడి పొరపాట్లు చేసిన యూదుల వలె ఉండకూడదు అనే హెచ్చరికతో ముగించబడినది. వారు విశ్వాసాన్ని బట్టి కాక వారి పనుల ద్వారా మరియు వారి మత వ్యవస్థ ద్వారా రక్షింపబడటానికి ప్రయత్నిస్తున్నారు. యూదుల మాదిరిగానే, మనము కూడా మంచిగా అనిపించే విషయాలపై పొరపాట్లు చేయవచ్చు లేదా మతపరమైన నియమాలను ఉంచు కోవచ్చును, అది యేసును తెలుసుకునే గొప్ప అనుభూతి మరియు సరళతను కోల్పోయేలా చేస్తుంది. యేసు తన రోజులలో మత వ్యవస్థకు అభ్యంతరకరముగా ఉన్నాడు మరియు అతను ఈ రోజులలో కూడా ఇబ్బందికరముగానే ఉన్నాడు. అందుకే మనము చిన్నపిల్లలవలే ఆయన వద్దకు రావాలని యేసు చెప్తున్నాడు మరియు ఇది ఇబ్బందికరమైనది కాదు. జ్ఞానము మరియు శక్తిని ఆరాధించేవారికి అతను బలహీనముగా మరియు మూర్ఖముగా కనిపిస్తున్నాడు. ఎవరి మనస్తత్వము లేదా పక్షపాతాలకు అనుగుణముగా సువార్త సందేశము ఎప్పుడూ మారదు. కొందరు సత్యము మీద పొరపాట్లు చేస్తున్నారు, కాని సత్యాన్ని పంచుకోవడము మన యొక్క పని. (2 తిమోతి 2: 23-26) దేవుని ఆత్మను మన హృదయాలలోనికి స్వేచ్ఛగా తిరిగే అనుమతి నిచ్చి, దేవుని యొక్క శక్తిని మనము అనుభవించుదాము.

**తనను పిలిచిన ఎవరినైనా క్రొత్త జీవితముతో ఆశీర్వదించడానికి దేవుడు సిద్ధముగా ఉన్నాడు.**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## తొమ్మిదవ పాఠము : 10-11 అధ్యాయములు

**పాఠ్యంశ వాక్యము** : ఇశ్రాయేలు తిరస్కరణలో కూడా దేవుడు శేషమును మిగిల్చాడు.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 10:1-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు యూదుల ఆలోచనను ఎందుకు అర్థము చేసుకున్నాడు (గలతీయులు 1: 13-17)?

2. ధర్మశాస్త్రము మరియు దాని అవసరములను (4 వ వచనము) సమాప్తి చేయడానికి ఎవరు వచ్చారు?

3. మనము లోపలినుండి మరియు బాహ్యముగా దేవుని వద్దకు ఎలా వస్తాము (9-10 వచనములు చూడగలరు)?

4. "యేసు ప్రభువు" అని చెప్పడము యొక్క అర్థము అంటే ఏమిటి (యోహాను 8:58 మరియు 10:30 కూడా చూడగలరు)?

5. 11 వ వచనములో ఏ వాగ్దానము ఇవ్వబడినది?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 10:12-18 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని ప్రేమ ప్రజలందరిపై ఉన్నదా? అది మనకు ఏవిధముగా తెలియును?

2. ఇతరులను దేవుని వైపు మరలించడానికి పౌలు ఏ 4 దశలు తెలియజేసాడు?

3. ఈ వచనములు సువార్తను పంచడానికి మిమ్మలను ఎలా ప్రోత్సహపరుస్తాయి?

4. సువార్త సందేశము ఎంత దూరము వెళ్ళడానికి ఉద్దేశించబడింది?

**<u>మూడవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 10:19-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఇశ్రాయేలు సువార్త సందేశమును వినినదా మరియు దానిని అర్థము చేసుకున్నదా?

2. అందరు చూడడానికి దేవుడు తన పనిని ఎక్కడ ప్రదర్శించాడు (కీర్తనలు 19: 1-4)?

3. ఏ ప్రజలు దేవుని కొరకు వెదకలేదు కాని ఆయనను కనుగొన్నారు?

4. దేవుడు ఇశ్రాయేలు వారికి ఎలా చేరుకున్నాడు?

5. అప్పుడు ఇశ్రాయేలు వారు ఎలా స్పందించినారు?

6. మతపరమైన వ్యక్తిగా ఉండి, తప్పుడు నమ్మకాలను పట్టుకోవడము సాధ్యమేనా?

**<u>నాలుగవ రోజు</u>** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 11:1-8 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుడు ఇశ్రాయేలును తిరస్కరించాడా?

2. దేవుడు ఇశ్రాయేలును తిరస్కరించలేదని చూపించడానికి పౌలు ఇచ్చిన ఉదాహరణలు ఎవరు?

3. 1 రాజులు 19: 9-18 ప్రకారము, ఏలీయా ఫిర్యాదు ఏమిటి?

4. మీకు ఏలీయా మాదిరిగానే భావించిన సందర్భాలు ఉన్నాయా?

5. కొన్నిసార్లు, మనకు దేవుని యొక్క దృక్పథము అవసరము! (యెషయా 55: 8 చూడగలరు)

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 11:9-36 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఏ వ్యక్తులు విచ్ఛిన్నమయ్యారు?

2. ఏ వ్యక్తులతో అంటు కట్టబడ్డారు?

3. 20 వ వచనము ప్రకారము, ఇశ్రాయేలు ఎందుకు విచ్ఛిన్నమైనది?

4. 25 వ వచనము ప్రకారము రహస్యము ఏమిటి?

5. విమోచకుడు ఎక్కడ నుండి వస్తాడు?

6. ఈ వచనములలో వివరించబడిన దేవుని యొక్క ఏ లక్షణము మీకు చాలా ఓదార్పునిస్తున్నదా?

**ఆరవ రోజు** :

తొమ్మిదవ పాఠము : **"ఇశ్రాయేలు యొక్క ప్రస్తుత తిరస్కరణ ఒక పునర్నిర్మాణాన్ని తెస్తున్నది"**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 10-11 అధ్యాయములు |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 11:33 "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము; ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు." |
| **పాఠ్యాంశ వాక్యము** | ఇశ్రాయేలు తిరస్కరణలో కూడా దేవుడు శేషమును మిగిల్చాడు. |
| **జీవిత సూత్రము** | దేవుని దగ్గరకు రావడానికి దేవుని మార్గమే ఏకైక మార్గము! |

**సారాంశము** :

తొమ్మిదవ అధ్యాయములో దేవుని సార్వభౌమాధికారముపై దృష్టి పెట్టిన తరువాత, 10 వ అధ్యాయములో మానవుని యొక్క బాధ్యత వైపు తిరుగుతాము. ఇశ్రాయేలు మెస్సీయ అయిన క్రీస్తు యేసును తిరస్కరించారు. క్రీస్తు యొక్క వ్యక్తిత్వము మరియు రక్షణను గూర్చిన సువార్త ఇశ్రాయేలుకు స్పష్టముగా తెలియజేయబడినప్పటికీ, వారు దానిని తిరస్కరించారు మరియు వారి యొక్క స్వంత నీతిని కోరుకున్నారు. అయినప్పటికీ, రక్షణ క్రీస్తు పట్ల హృదయము యొక్క

మార్పు ద్వారా మాత్రమే వచ్చును (9-10 వ వచనములు). ఇశ్రాయేలు యొక్క తప్పుడు నీతి మరియు తిరస్కరణ యొక్క పాపము ఉన్నప్పటికీ, దేవుడు మహిమాన్వితమైన మరియు నూతనమైన దానిని తీసుకువచ్చాడు. దేవునికి దూరముగా ఉన్న ప్రజలు, నిరీక్షణ లేని పరజనులు, పరదేశులు (ఎఫెసీయులు 2: 11-19) దేవుని వద్దకు తీసుకుని రాబడినారు. దేవుని హృదయములో ఉన్న అన్యజనుల కొరకు తలుపు విస్తృతముగా తెరిచి ఉంది (ద్వితీయోపదేశకాండము 30:14). దేవునికి, ఇప్పుడు యూదులు మరియు అన్యజనుల మధ్య ఏమియు తేడా లేదు. 11-13 వచనములలో "అందరు" అనే పదము పదే పదే పునరావృతమవుతుంది. ప్రత్యేకమైన సమూహాలు ఏమియు లేవు. ప్రపంచములోని ప్రజలందరిని దేవుడు కలిగి ఉన్నాడు. "ఎందుకనగా— ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయు వాడెవడో వాడు రక్షింపబడును." (13 వ వచనము).

14-15 వచనముల నుండి, పౌలు ఒక వ్యక్తిని రక్షణలోనికి నడిపించే సంఘటనల గొలుసును వివరించడానికి అలంకారిక ప్రశ్నల శ్రేణిని ఉపయోగించాడు. ఈ వచనముల యొక్క అనువాదము స్పష్టముగా ఉన్నది: (1) యేసు అలా చేయగలరని ప్రజలు విశ్వసిస్తేనే వారు రక్షించమని పిలుస్తారు (2) క్రీస్తు గురించి ఏమియు తెలియకుండా, ఆయనపై నమ్మకమును ఉంచకూడదు; (3) ఎవరైనా రక్షణ సందేశాన్ని ప్రకటించినప్పుడు మాత్రమే క్రీస్తు గురించి వింటారు; మరియు (4) అలా సువార్త ప్రకటించడానికి ఎవరినైనను దేవుని ద్వారా పంపబడకపోతే క్రీస్తు గురించిన సందేశము ప్రకటించబడదు. ఇశ్రాయేలుకు నిజమైన రక్షణ సందేశాన్ని అందించాలన్న పిలుపునకు క్రీస్తు స్వయముగా సమాధానము ఇచ్చాడు, కాని వారు ఆయనను తిరస్కరించారు. వారు నమ్మడానికి నిరాకరించడము అనేది క్షమించబడనిది. "మరియు యెషయా తెగించి — నన్ను వెదకనివారికి నేను దొరకితిని; నన్ను విచారింపనివారికి ప్రత్యక్షమైతిని అని చెప్పుచున్నాడు. ఇశ్రాయేలు విషయమైతే— అవిధేయులై యెదురాడు ప్రజలకు నేను దినమంతయు నా చేతులు చాచితిని అని చెప్పుచున్నాడు." (రోమా 10:20,21 వ వచనములు).

మన హృదయములను మనము పరిశీలించుకోవాలి. ఈ బోధన ఇశ్రాయేలు వైపు మళ్ళించినప్పటికీ, మన యొక్క ఈ దినములకు వర్తించే ఏవైనా హెచ్చరికలు మరియు అర్థముల కొరకు మనము గమనించవలయును. ఇశ్రాయేలు ధర్మశాస్త్రమునకు విధేయత చూపడము ద్వారా దేవుని వద్దకు రావడానికి ప్రయత్నించాడు, కాని అది అసాధ్యము. దేవుని ధర్మశాస్త్రము లేదా ఆజ్ఞలు దేవుని యొక్క ప్రమాణములు, వీటిని పాటించడము మానవునికి అసాధ్యము. ఇది మన పాపమును మరియు మన పాపములో దేవుని నుండి ఎంత దూరములో ఉన్నామో చూపిస్తున్నది. దేవుని ఏకైక మార్గము, తండ్రి ముందు మానవుడు సరైన స్థితిని పొందగల ఏకైక మార్గము-క్రీస్తు ద్వారా మాత్రమే, ఇక వేరే మార్గము ఏదియును లేదు. మీరు క్రీస్తు రక్షణ కార్యమును తిరస్కరించారా మరియు మీ స్వంత నీతిని సంపాదించడానికి ప్రయత్నిస్తున్నారా? అని పరిశీలించుకోవలయును.

మీ దగ్గరకు సువార్త ఎలా వచ్చినది? దేవుడు తన గురించి నిజమైన జ్ఞానాన్ని పంచుకోవడానికి ప్రజలను ఉపయోగించుకుంటాడు. రక్షణ సందేశము వినిన తర్వాత, అతను అందరికి ప్రభువు మరియు యజమానుడు అని ఒప్పుకోవాలి. వారి హృదయములో యేసు మృతులలోనుండి లేచాడని నమ్మవలయును అప్పుడు మాత్రమే రక్షింపబడతారు. దేవుడు లేని సమయము నుండి, దేవునితో గడిపే సమయమును కలిగిన వారి జీవితాలలో ఒక మార్పు కనబడుతుంది. అందరికిని చూడటానికి తేడా కనబడుతుంది. ఈ గొప్ప పరివర్తన పౌలు జీవితములో జరిగినది (అపొస్తలుల కార్యములు 9 వ అధ్యాయము). మారిన హృదయము, జీవితము ఫలితముగా, సువార్తను భూమి చివరి వరకు వ్యాప్తి చేయడములో పౌలు అత్యవసరముగా పనిచేసాడు. "ప్రకటించువారు పంప బడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై— ఉత్తమమైనవాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడి యున్నది" (10:15 వ

వచనము). దేవుడు మీ జీవితాన్ని ఈ రోజులలో ఊహించని క్షణాల్లో, ఊహించని విధముగా ఉపయోగించుకుంటాడు, నశించిపోతున్న వారికి శాశ్వతమైన రక్షణ సందేశాన్ని అందజేయడములో మిమ్మలను సుందరముగా వాడుకుంటాడు.

11 వ అధ్యాయములో, పౌలు ఇశ్రాయేలు యొక్క గత, వర్తమాన మరియు భవిష్యత్తును విభజించాడు. ఇశ్రాయేలు యొక్క గతము దేవుని కార్యాచరణ మరియు వాగ్ధానములతో గొప్పది, ఇది మెస్సీయాను పంపించడములో ముగిసినది (9: 4-5). కాని అప్పుడు వారు మెస్సీయాను తిరస్కరించారు (5 వ వచనము ప్రకారము శేషము తప్ప). ఇశ్రాయేలు ఇప్పుడు అవిశ్వాసము యొక్క ఫలితముగా చీకటిగా మరియు అంధత్వముగా వర్ణించబడినది (10 వ వచనము). అయినప్పటికీ దేవుడు తన ఒడంబడిక వాగ్ధానములకు నమ్మకమైనవాడు. మన దేవుడు వాగ్దానములను నెరవేర్చే దేవుడు. ఇశ్రాయేలు తిరస్కరణ మరియు వారు దేవుని యొక్క మంచితనములోకి ప్రవేశించడానికి ఇష్టపడకపోవడము అన్యజనులకు గొప్ప అవకాశమును తెచ్చిపెట్టినది (12 వ వచనము). దేవుని కృప యొక్క రహస్యము 25-37 వచనములలో తెలియబడుతుంది, అందరి యెడల దేవుని యొక్క దయ చాలా మంది యొక్క రక్షణతో ముగుస్తుందని గమనించవచ్చును. దేవుడు లోకమును ఎంతగానో ప్రేమించాడు మరియు తన కుమారుని బలి ద్వారా మనలను తన కుటుంబంలోనికి స్వీకరించాడు, యేసు క్రీస్తు ప్రభువు "అదృశ్య దేవుని యొక్క కనిపించే వ్యక్తీకరణ" కొలొస్సయులు 1:15. కానీ ఇశ్రాయేలు దేశము ఇప్పటికీ దేవుని చేతుల్లోనే ఉన్నది. ఒక శేషము ఉన్నది!

18-20 వచనములలో అన్యజనుల విశ్వాసులు వారియొక్క అహంకారమునకు వ్యతిరేకముగా హెచ్చరించబడ్డారు, ఎందుకంటే దేవుని రక్షణ వాగ్దానములు మరియు వారి మంచితనము కాదు, వారిని రక్షించినది. దేవుడు యూదుల కొమ్మలను ఒలీవ చెట్టు నుండి తీసివేసి, బదులుగా వాటిని అంటు వేసినందున అన్యజనులు అహంకారముతో ప్రలోభాలకు లోనవుతున్నారు. ఇది చాలా భయంకరమైన మరియు ఇబ్బందికరమైన విషయము. యూదులు విశ్వసించడములో విఫలమైనందున తొలగించబడ్డారు మరియు అన్యజనులు వారి నిరంతర నమ్మకము వలన మాత్రమే మిగిలిపోయారు. యూదులు లేదా అన్యజనులు ఎవరయినా నమ్మకమును కొనసాగించని వారిని ఎవరిని కూడ దేవుడు విడిచిపెట్టడు. దేవుడు చేసిన మరియు చేస్తూనే ఉన్నందుకు మనము భయపడి జీవించుదాము. సృష్టితో కలిసి ఆయన మహిమను ప్రతిబింబించడము మన యొక్క ఉద్దేశ్యము. ఈ వారము ఆయనకు కీర్తి తెచ్చే ఉద్దేశ్యముతో మీరు ఎలా అడుగు వేయగలరు? చర్చించుము మరియు తెలియపరచుము.

**దేవుని దగ్గరకు రావడానికి దేవుని మార్గమే ఏకైక మార్గము!**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## పదవ పాఠము : 12 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : ఈ లోకములో దేవుని యొక్క ఉనికిని, ప్రేమను, రూపాంతరము చెందించే సన్నిధి గల క్రీస్తు శరీరములో మనము ఐక్యమై ఉన్నాము.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 12:1-2 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవునికి మనము ఎలాంటి బలిని ఇవ్వవలయును?

2. మనము క్రొత్త వ్యక్తిగా ఎలా రూపాంతరము చెందుతాము?

3. దేవుని చిత్తమును ఏ మూడు పదాలు వివరిస్తాయి?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 12:3-4 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు మనకు ఏ హెచ్చరికను ఇస్తున్నాడు?

2. క్రీస్తు శరీరములో ఇది ఎందుకు ప్రాముఖ్యమైనది?

3. మీ గురించి ఎక్కువగా ఆలోచించడములో మీరు ప్రలోభపడే ఏదైనా ఒక ప్రాంతము (శరీరములో) , విషయము ఉన్నదా?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 12:5-8 వరకు అధ్యయనము చేయగలరు**

1. క్రీస్తు శరీరములోని సభ్యులందరు ఎవరికి చెందినవారు?

2. ఈ లేఖనభాగములో ఇవ్వబడిన కొన్ని వరములతో పాటు 1 కొరింథీయులకు 12 లో ఉన్న వాటిని వ్రాయగలరు?

3. బలహీనమైన మరియు తక్కువ ప్రాముఖ్యమైన వరములు కూడ చాలా అవసరమని మీరు ఎందుకు అనుకుంటున్నారు (1 కొరింథీయులు 12: 21-27 కూడా చూడగలరు)?

4. 6 వ వచనము ప్రకారము, మన వరములు ఎందుకు భిన్నముగా ఉన్నాయి?

5. ఎఫెసీయులకు 4: 11-13 ప్రకారము, ఆత్మీయ వరముల ఉద్దేశ్యము ఏమిటి?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 12:9-16 వరకు అధ్యయనము చేయగలరు**

1. మనము ఒకరి యెడల ఒకరు చూపించుకోవలసిన దైవీకమైన ప్రేమను వివరించగలరు?

2. ఆ అసాధ్యమైన ప్రేమను ప్రదర్శించడానికి మనకు ఎవరు సహాయపడగలరు?

3. తక్కువ స్థానములో ఉన్న వారితో సహవాసము చేయమని పౌలు ఎందుకు చెప్పాడు?

4. ఒక క్రైస్తవుడు పరీక్షలను అనుభవించడము సాధారణమని మీరు అనుకుంటున్నారా? (2 తిమోతి 3:12 కూడా చూడగలరు)

5. పట్టుదల గురించి యాకోబు 1: 2-4 ఏమి తెలియజేస్తున్నది?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 12:17-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. 17-18 వచనాల ప్రకారము, మనము ఈ ప్రపంచములో జీవిస్తున్నప్పుడు మనకు ఎలాంటి ప్రవర్తన మరియు వైఖరి ఉండాలి?

2. మనము ఎందుకు ప్రతీకారము తీర్చుకోకూడదు?

3. మన శత్రువులతో మనము ఎలా వ్యవహరించాలి?

4. ప్రేమించుటలో ఏ విషయము మీకు సాధన చేయడము, పాటించడము కష్టముగా ఉంటుంది?

5. దేవుని ప్రేమను చూపించడానికి మీకు దేవుని సహాయము ఎక్కడ అవసరమో చూపించమని దేవుడిని అడుగగలరు.

**ఆరవ రోజు** :

పదవ పాఠము : **"సజీవ యాగముగా సమర్పించుకొనుట"**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 12 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 12:1-2 "[1]కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. [2] మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి." |
| **పాఠ్యాంశ వాక్యము** | ఈ లోకములో దేవుని యొక్క ఉనికిని, ప్రేమను, రూపాంతరము చెందించే సన్నిధి గల క్రీస్తు శరీరములో మనము ఐక్యమై ఉన్నాము. |
| **జీవిత సూత్రము** | త్యాగముతో కూడినదే దేవుని ప్రేమ. |

**సారాంశము** :

పౌలు ధైర్యముగా ఈ లేఖన భాగములను చదివేవారు తమ జీవితములను తిరిగి దేవునికి సజీవ యాగముగా సమర్పించుకోమని బతిమాలుకొనుచున్నాడు. సజీవ యాగము ? రోమా 1-11 అధ్యాయములలో ఆయన చెప్పిన అన్నిటికీ మన ప్రతిస్పందన ఉండాలి అని పౌలు చెబుతున్నాడు. క్రీస్తు మనకొరకు చేసినదానికి ఇది విశ్వాస ఆధారమైన ప్రతిస్పందనగా ఉండాలి. మృతుల నుండి సజీవులుగా ఉన్న మనము, క్రీస్తుతో నూతన జీవితాన్ని అనుభవిస్తున్న మనము (6: 4), మన ఆత్మీయ ఆరాధనలో మన జీవితమంతా తిరిగి దేవునికి అర్పించే వారిగా మనము ఉండాలి. డబ్బు, సమయము, ప్రతిభ, సేవ వంటి వస్తువులను దేవునికి ఇవ్వడము చాలా సులభముగా ఉంటుంది. మనంతట మనలను ఇవ్వడమే మరింత పెద్ద సవాలు, మరింత త్యాగముతో కూడినదైనది. అయితే దేవుడు మన చేతులను, మన నాలుకను, మన మనసులను మాత్రమే కోరుకుంటున్నాడా? మీ శరీరములోని ప్రతి భాగాన్ని ప్రతిరోజూ దేవునికి కృతజ్ఞతతో ఆయనకు అప్పగించవలయును. మనలను మనము అప్పగించుకొనుట అనేది ప్రతిరోజు మనపై ప్రభావము చూపే ప్రపంచ విలువల నుండి వేరుచేయడము అని అర్థము.

మనము దేవునికి లొంగిపోతున్నప్పుడు, మనము ఈ లోకపు విలువల నుండి వేరు చేయబడి ఇతరులకు సేవ చేస్తాము, ఇది దైవీకమైన ప్రేమ యొక్క బాహ్య వ్యక్తీకరణ. ఈ లోక మార్గములకు అనుగుణముగా కాకుండా, దేవుని ప్రయోజనముల కొరకు మనము రూపాంతరము చెందాలి. 1 యోహాను 2: 15-17 మనలను ఈ లోక ఆలోచనలో ఉంచడానికి శత్రువు మనకు వ్యతిరేకముగా ఉన్నట్లు గుర్తుచేస్తున్నది. కాబట్టి, రూపాంతరము కొరకు యుద్ధము మన మనస్సులలో ప్రారంభమవుతుంది. దేవుడు మన హృదయములతో, మనస్సులతో మాట్లాడతాడు కావున మనము ఎల్లప్పుడు వాక్యములో మరియు వాక్యముతోనే ఉండాలి.

సజీవ యాగము యొక్క ఈ ఆలోచనను కొనసాగిస్తూ, పౌలు శరీరములోని వరములను వివరించాడు. పరిశుద్ధాత్మ ప్రతి విశ్వాసికి క్రీస్తు శరీరములో ఉపయోగించడానికి వరములను ఇస్తున్నది. ఈ వరముల జాబితా గ్రంథములో కనిపించే అనేక వాటిలో ఒకటి. 1 కొరింథీయులకు 13 మరియు ఎఫెసీయులకు 4:11 కొన్ని వరములను కూడా వివరిస్తున్నది, కాని ఇవ్వబడిన విభిన్న వరములు మరియు ప్రతి ఒక్కటిని ఎంత భిన్నముగా చూడవచ్చునో మరియు ఉపయోగించవచ్చునో అను దానిని పూర్తిగా వివరించలేము. అవి చాలా భిన్నమైనవి మరియు మన సహజ వ్యక్తిత్వాలతో కలిసి పనిచేయగలవు లేదా మనము ఎవరో అనుకునేవారికి పూర్తిగా భిన్నముగా ఇవి కనిపిస్తాయి. కొన్ని వరములు తరువాత గుర్తించదగినవి, కానీ ప్రతి ఒక్కటి లోకములోని దేవుని పనికి చాలా ప్రాముఖ్యమైనవి. దేవుడు మన మహిమ కొరకు ఈ లోకములో ఏమి చేస్తున్నాడో దానిని పూర్తి చేయడానికి మనకు ఇచ్చిన వరములను ఉపయోగించడము మన యొక్క పూర్తి బాధ్యతయై యున్నది.

నిజమైన ప్రేమ ఈ వరముల జాబితాలను అనుసరిస్తాయి. మన అంతరంగములో దేవుని ఆత్మ యొక్క క్రియ లేకుండా మన వైఖరి మరియు సంబంధాలలో ప్రేమ ఎలా చూపించగలుగుతాము. మనము దేవుని వాక్యముతో మరియు మనలోని దేవుని ఆత్మతో నడిపించ బడుచున్నందున సంబంధాలలో ప్రేమ, మన సమాజములో ప్రేమ మరియు మన శత్రువుల పట్ల ప్రేమ అభివృద్ధి చెందుతుంది. క్రీస్తు యేసు యొక్క సారూప్యములోనికి మనము ఆకృతి చేయబడాలని ఆయన కోరుకుంటున్నాడు. మన జీవితములలో క్రియల ద్వారా వ్యక్తీకరించబడిన యేసు యొక్క దైవీకమైన, అసాధ్యమైన ప్రేమను గూర్చి ఇతరులు సాక్ష్యమిచ్చుచున్నందున ఈ ప్రేమ ఒక మార్పును చేకూర్చే ఆయుధముగా మారుతుంది. ఈ ప్రేమను చూపించుట ద్వారానే యేసు క్రీస్తు యొక్క శిష్యులమని లోకము గుర్తిస్తుందని యేసు చెప్పాడు (యోహాను 13: 34-35). లోకము మనలను యేసు క్రీస్తు శిష్యులనుగా గుర్తించినదా? చర్చించుము.

**త్యాగముతో కూడినదే దేవుని ప్రేమ.**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## పదకొండవ పాఠము : 13 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : మన ప్రవర్తనను రూపొందించడానికి మరియు ఇతరులకు చూపించడానికి, ప్రేమను అనుమతించడము మన యొక్క ప్రాముఖ్యమైన బాధ్యతయై యున్నది.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 13:1-2 వరకు అధ్యయనము చేయగలరు**

1. లోక సంబంధమైన అధికారము మరియు దేవుని మధ్య సంబంధము గురించి ఈ భాగము మనకు ఏమి బోధిస్తున్నది?

2. మనము లోక సంబంధమైన అధికారులను వ్యతిరేకిస్తే, ఎవరిని ప్రతిఘటిస్తున్నామని అర్థము ?

3. లోక సంబంధమైన అధికారము ఉన్నవారికి మన యొక్క బాధ్యత మరియు ప్రతిస్పందన ఏమిటి?

4. 1 తిమోతి 2: 1-4 నుండి దీనిని గురించి ఏమి నేర్చుకోవచ్చును?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 13:3-4 వరకు అధ్యయనము చేయగలరు**

1. 1-4 వ వచనములలో దేవుని యొక్క ఏ లక్షణాన్ని మీరు గుర్తించగలరు?

2. అధికారమునకు మనము ఎందుకు భయపడాలి?

3. లోక సంబంధమైన అధికారమును ధిక్కరించడానికి క్రైస్తవుడి యొక్క పరిస్థితి ఎలా ఉండాలి? (కీర్తనలు 2: 1-3 మరియు అపొస్తలుల కార్యములు 5: 27-29 కూడా చూడగలరు)

4. పౌర ప్రభుత్వముల యొక్క ఉద్దేశ్యము ఏమిటి?

5. ప్రభుత్వాలు తమ పాలనను అమలు చేసే హక్కును పౌలు ఎలా సమర్థిస్తున్నాడు?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 13:5-7 వరకు అధ్యయనము చేయగలరు**

1. మనము అధికారమునకు సమర్పించుకోవడానికి గల కారణములు ఏమిటి?

2. అధికారమునకు విధేయత చూపించుటను గురించి 1 పేతురు 2: 11-16 ఏమి చెబుతుంది?

3. మన అధికారులు ఎవరికి సేవ చేయుచున్నారు మరియు ఇది విశ్వాసులుగా మనలను ఎలా ప్రభావితము చేస్తున్నది?

4. పన్నులు చెల్లించడము గురించి ఈ లేఖన భాగములు ఏమి చెబుతున్నాయి?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 13:8-10 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఇతరుల మరియు దేవుని పట్ల మనకున్న ప్రేమను ఎలా ప్రదర్శిస్తాము?

2. పౌలు ధర్మశాస్త్రమును ప్రతికూలమైనదిగా లేదా సానుకూలమైనదిగా వర్ణించాడా?

3. పొరుగువానిని ప్రేమించువాడే ధర్మశాస్త్రమును నెరవేర్చినవాడు అని ఎలా చెప్పగలము?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 13:11-14 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ వచనముల ప్రకారము, ఇది ఏ సమయము?

2. చీకటి మరియు రాత్రి బైబిలులో పాపము మరియు చెడును సూచిస్తాయి. విశ్వాసులు వేటిని ధరించవలయును (ఎఫెసీయులు 6:11, 1 థెస్సలొనీకయులు 5: 8)?

3. యోహాను 1: 1-5; 9: 4-5, మరియు 1 యోహాను 1: 5-7 గమనించగలరు. మన వెలుగు యొక్క వనరు ఎవరు మరియు ఈ లోకములో దాని ప్రభావము ఏమిటి లేదా ఎలాగుంటుంది?

4. లోకమునకు ఆయన వెలుగు యొక్క ప్రతిబింబమైన దేవుడని ఎలా గౌరవిస్తాము?

**ఆరవ రోజు** :

పదకొండవ పాఠము : "**ప్రజా (లోకసంబంధమైన) అధికారము కొరకైన మన బాధ్యత**"

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 13 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 13:14 "మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించుకొనినవారై, శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీరము విషయమై ఆలోచనచేసికొనకుడి." |
| **పాఠ్యాంశ వాక్యము** | మన ప్రవర్తనను రూపొందించడానికి మరియు ఇతరులకు చూపించడానికి, ప్రేమను అనుమతించడము మన యొక్క ప్రాముఖ్యమైన బాధ్యతయై యున్నది. |
| **జీవిత సూత్రము** | దేవుడు మనల్ని ప్రేమిస్తున్నందున మనము ఇతరులను ప్రేమిస్తూ మరియు చీకటి ప్రపంచంలో వెలుగుగా ఉండగలము. |

**సారాంశము** :

13 వ అధ్యాయము రెండు సమస్యలను పరిశీలిస్తున్నది. ప్రజా (లోక సంబంధమైన) అధికారమునకు మనయొక్క బాధ్యత మరియు ప్రేమ మన ప్రవర్తనను రూపొందించడానికి అనుమతించే బాధ్యత.

దేవుని అనుమతి లేకుండా పాలనా అధికారము ఏదీ లేదని మనము తెలుసుకొనుచున్నాము. మనము మానవ అధికారమును ప్రతిఘటించినప్పుడే, దేవుని అధికారమును వ్యతిరేకిస్తాము. దేవుని అనుచరులుగా అధికారుల పట్ల మన గౌరవము మరియు వైఖరి ప్రాముఖ్యమైనవి. విశ్వాసము యొక్క సమస్యలపై భూసంబంధమైన అధికారులు దైవీకమైన అధికారముతో విభేదించినప్పుడు 5 వ వచనములో మాత్రమే మినహాయింపు ఉన్నది. పేతురు మరియు యోహానుల యొక్క రచనలు అపొస్తలుల కార్యములు 5: 29 లో మనము చూసేదానికి అనుగుణముగా ఉంటాయి, "మనము మనుష్యులకు బదులుగా దేవునికి తప్పక విధేయత చూపాలి".

మనము క్రీస్తును అనుసరించుచున్నప్పుడు, మన సంబంధాలన్నీ మారిపోవుటను మనము గుర్తిస్తాము. స్వార్థ లాభము ద్వారా ప్రేరేపించబడకుండా, ఇతరులపై ప్రేమ మరియు దేవుని పట్ల ఆరోగ్యకరమైన భయము వల్ల మనము ప్రేరేపించబడతాము. పన్నెండు అధ్యాయము యొక్క తరువాయి భాగము చూపించినట్లుగా, రక్షణ ద్వారా మనము క్రీస్తుతో

కలిసి ఉన్నప్పుడు, మనము కూడా ఇతర విశ్వాసులతో కలిసి క్రీస్తు యొక్క “శరీరము” లో కలిసిపోతాము. అప్పుడు పన్నెండు అధ్యాయము యొక్క చివరి భాగములో మరియు పదమూడవ అధ్యాయములో, పాలక అధికారాలతో, సాధారణముగా మానవాళికి, మరియు సమాజమంతా మన సంబంధములు మారుతాయని ఆయన వివరించారు. పద్నాలుగవ అధ్యాయములో చర్చించినట్లు మన అంతర్గత వైఖరులు కూడా భిన్నముగా ఉంటాయి. బలహీనుల పట్ల మన వైఖరులు క్రైస్తవుడిగా మారడానికి ముందు ఉన్న దానికి పూర్తిగా విరుద్ధముగా ఉంటాయి. తమను తాము పట్టించుకోలేనివారిని మనము చూసుకుంటాము (యాకోబు 1:29). మరియు నశించి పోయినవారి (పదిహేనవ అధ్యాయము) పట్ల మన వైఖరి పూర్తిగా భిన్నముగా ఉంటుంది. వీటిని చేరుకోవటానికి మనకు మండుతున్న అభిరుచి ఉంటుంది, ఇంతకు మునుపు మనకు భిన్నమైన కారణములు ఉండేవి.

1 పేతురు 2: 17 లో పేతురు చెప్పినదాని ద్వారా ఈ విషయాలన్నింటినీ ఉత్తమముగా క్లుప్తపరచవచ్చును, “అందరిని సన్మానించుడి, సహోదరులను ప్రేమించుడి, దేవునికి భయపడుడి, రాజును సన్మానించుడి.”

**దేవుడు మనల్ని ప్రేమిస్తున్నందున మనము ఇతరులను ప్రేమిస్తూ మరియు చీకటి ప్రపంచంలో వెలుగుగా ఉండగలము.**

## రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

### పన్నెండవ పాఠము : 14 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : ఒక్కొక్క మెట్టు ఎక్కినట్లుగా, మనము ఇతరులతో సమాధానమును మరియు దేవుని దృక్పథాన్ని కోరుకోవాలి.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 14:1-4 వరకు మరియు 1 కొరింథీ 8:1-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. బలహీనమైన సోదరుడు ఎవరు?

2. ఈ లేఖన భాగము ప్రకారము, విశ్వాసములో బలహీనముగా ఉన్నవారి యెడల మనము ఎలా స్పందించాలి?

3. రోమా 14: 3 ప్రకారము, దేవుడు అట్టి వారి యెడల ఎలా స్పందిస్తాడు?

4. మరొకరిని తీర్పు తీర్చే స్థితిలో (స్థాయిలో) ఎవరు లేరు?

5. మరొకరిని తీర్పు తీర్చడము మరొకరి పట్ల మీ ప్రేమకు అనుగుణముగా ఉంటే, మీ హృదయాన్ని మరియు వైఖరిని మార్చమని దేవుడిని అడుగవలయును.

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 14:4-8 వరకు అధ్యయనము చేయగలరు**

1. మనము ఇతరులను ఎందుకు తీర్పు తీర్చకూడదు (మత్తయి 7: 1-5 కూడా చూడగలరు)?

2. మనము ప్రతి ఒక్కరము ఎవరికి జవాబుదారీగా ఉన్నాము?

3. "పూర్తిగా నమ్మకము" గల మన నమ్మకము మరియు మనము చేసే పనుల గురించి మనము ఏవిధముగా నిర్ణయిస్తాము? (రోమా 12: 1-2 కూడా చూడగలరు)

4. 1 కొరింథీయులకు 12:25 మన వైఖరిని ఎలా ప్రభావితము చేస్తున్నది లేదా మనము నమ్మేదానిని రూపొందించడానికి ఎలా సహాయము చేస్తున్నది?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 14:9-12 వరకు అధ్యయనము చేయగలరు**

1. క్రీస్తు యొక్క మరణ పునరుత్థానముల యొక్క మాదిరి, మనము ఇతర విశ్వాసులతో ఎలా స్పందిస్తామో అనే దానిని ప్రతిబింబిస్తుంది?

2. మనము ఇతరులను తీర్పు తీర్చడములో ఎందుకు పడిపోతాము? (రోమా 7: 19-20 కూడా చూడగలరు)

3. క్రీస్తు యొక్క న్యాయ తీర్పులో ఏమి జరుగుతుంది?

4. నీవు ఈ వచనముల ద్వారా దోషిగా చేయబడ్డావా లేదా ప్రోత్సహించబడ్డావా?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 14:13-18 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ వచనముల ప్రకారము, దేవుని కుటుంబములోని ఇతర సభ్యులకు మనము ఎలా హాని కలిగిస్తాము?

2. మన ప్రస్తుత రోజులలో, ఇతర విశ్వాసులకు కలిగే అవరోధాలు ఏమిటి?

3. 1 కొరింథీయులకు 8: 4-13 వాక్యభాగము మీ అవగాహనకు ఎలా తోడ్పడుతుంది?

4. ప్రేమలో నడచుకొనుటను గురించి పౌలు 15 వ వచనములో ఏమి చెప్పాడు?

5. ఒకరిని విశ్వాసమును ప్రోత్సహించడము లేదా నిరుత్సాహపరచడము ఏది సులభము?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 14:19-23 వరకు అధ్యయనము చేయగలరు**

1. 19 వ వచనము ప్రకారము, మన లక్ష్యము మరియు బాధ్యత ఏమిటి? (గలతీయులకు 6: 1 కూడా చూడగలరు)

2. మనకు మరియు దేవునికి మధ్య మనము ఏమి ఉంచవలయును?

3. 13 మరియు 21 వ వచనములలో ఏ పదములు పునరావృతమవుతాయి? ఇది ఎందుకు అంత ప్రాముఖ్యమైనది?

4. ఎలా వ్యవహరించాలో నిర్ణయించడానికి మనకు ఏది సహాయపడుతుంది? (కీర్తనలు 119: 23-24 మరియు యాకోబు 1:5 కూడా చూడగలరు)

5. ఈ అధ్యాయము యొక్క చివరి వచనము క్రైస్తవులందరికీ ఎలా వర్తిస్తున్నది?

**ఆరవ రోజు** :

పన్నెండవ పాఠము : “**అంగీకరించబడే వైఖరి**”

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 14 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 14:19 “కాబట్టి సమాధానమును, పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయు వాటినే ఆసక్తితో అనుసరింతము.” |
| **పాఠ్యాంశ వాక్యము** | ఒక్కొక్క మెట్టు ఎక్కినట్లుగా, మనము ఇతరులతో సమాధానమును మరియు దేవుని దృక్పథాన్ని కోరుకోవాలి. |
| **జీవిత సూత్రము** | ఒక్కొక్క మెట్టు ఎక్కే వారిగా ఉండండి, కాని అడ్డుబండగా ఉండకండి. |

**సారాంశము** :

విశ్వాసము యొక్క విశ్వాసులకు సార్వత్రికమైన మరియు అవసరమైన సమస్యలను మనము పరిశీలించాము, కాని 14 వ అధ్యాయము విశ్వాసుల మధ్య ఉన్న విభిన్నమైన విషయాలను పరిశీలిస్తున్నది. దేవునితో మన వ్యక్తిగత సహవాసమునకు మరియు ఇతరులకు చేసే పరిచర్యకు అవసరమైన విషయాలను వ్యక్తిగతముగా నిర్ణయించడానికి పరిశుద్ధాత్మ మనలో ప్రతి ఒక్కరికి సహాయపడుతాడు. దేవుడు మనలను నడిపించే దానికంటే భిన్నముగా ఇతరులను నడిపించవచ్చును. కొన్ని విషయాలను నివారించడానికి లేదా ఇతరులు ఇష్టపడని వాటిలో పాలుపంచుకోవడానికి ఆయన మనలను పిలుస్తారు. మనము సహించడమే కాదు, ఈ తేడాలను గౌరవించాలి మరియు అభినందించాలి.

మనమందరము వేర్వేరు సమయములలో మరియు వివిధ నేపథ్యముల నుండి దేవుని వద్దకు వస్తాము, ఆదిమ సంఘములో విద్యావంతులు, బానిసలు, ధనికులు మరియు పేదలు, పన్ను వసూలు చేసేవారు మరియు మత పెద్దలు, ప్రభుత్వములో ఉన్నవారు మరియు ప్రభుత్వమును వ్యతిరేకించేవారు, యూదులు మరియు అన్యజనులు ఉన్నారు. దేవుని పిలుపు ప్రజలందరికి వెళ్ళినది మరియు అందువలన అతని పిలుపుకు ప్రతిస్పందించిన వారు అందులో ఉన్నారు కావున సంఘము అద్భుతమైన వైవిధ్యాన్ని సూచించింది. ఈ వైవిధ్యములో సువార్తకు అవసరము లేని నమ్మకాలు మరియు జీవనశైలి ఉన్నాయి. రక్షణకు అవసరమైన వాటిపై మాత్రమే మనకు గ్రంథము నుండి స్పష్టమైన సిద్ధాంతము ఉంది. ఇతర సమస్యల కోసము, మన మనస్సాక్షి మరియు అవగాహన కారణముగా మనము చేసే విధానాన్ని నమ్ముతామని మరియు ప్రవర్తిస్తామని పౌలు చెప్పాడు. 'బలమైన' మరియు 'బలహీనమైన' విశ్వాసులు ఉన్నారని ఆయన చెప్పారు, కాని దేవుడు ఇద్దరిని 'నిలబడుటకు' చేయగలడు. ఇందులో, మనమందరము నిజమైన మరియు పరిపూర్ణ న్యాయమూర్తి అయిన దేవునికి జవాబుదారీగా నిలబడతాము. ఆయన ముందు, మన వరములు మరియు త్యాగాలు మన నిజమైన ఉద్దేశ్యాల వెలుగులో కనిపిస్తాయి, మన విజయాలు లేదా వైఫల్యాలు ఆయనకు నిజమైన విధేయత మరియు ఇతరులపై మనకున్న నిజమైన ప్రేమ వెలుగులో కనిపిస్తాయి. దేవుడు తన తీర్పును, తన శక్తిని వినియోగించుకునే ప్రతి హక్కును కలిగి ఉన్నాడు, కాని తన తీర్పు యొక్క విషయాలు, వస్తువులైన వారితో చాలా ఓపికగా ఉండటానికి కూడా ఆయనకు హక్కు ఉంది ... , (రోమా 9:22).

"విశ్వాసములో బలహీనుడు" అని అనగా పౌలు రక్షణను గూర్చిన విశ్వాసములో బలహీనుడు అని అర్థము కాదు, కానీ "జ్ఞానము" లేకపోవడము అని అర్థము (1 కొరింథీయులు 8: 9-11). సంబంధము లేకుండా, మన 'బలహీనమైన' సోదరులు మరియు సోదరీమణులు దేవునికి చెందినవారు మరియు ఆయన వారిని అంగీకరిస్తాడు. మనము కూడా ఇతరులను స్వాగతించే వైఖరితో అంగీకరించాలి మరియు యేసు ముందుకు సాగడానికి ప్రోత్సహించినట్లుగా వారిని ప్రోత్సహించాలి. మానవ తీర్పునకు అవసరము లేదు మరియు ఇతరుల అభిప్రాయాలపై మనము గొడవ చేయకూడదు. దేవుడిలాగే ఇతరులను పరిగణించడము మన బాధ్యతగా మనము చూడాలి. దేవుని పిలుపు ఒక స్వరము యొక్క సామరస్యాన్ని "వారందరు ఏకమైయుండవలెనని" తప్పనిసరి చేస్తుంది, దీనిని యోహాను 17: 21 లో యేసు ప్రార్థించాడు. సువార్త వైపు చూసే ప్రపంచాన్ని ఆకర్షించే అందమైన ఐక్యత కోసము ఈ వైవిధ్యాలన్నింటిని మించిన దేవుని ప్రేమ యొక్క అద్భుతము ఇది.

మన తోటి విశ్వాసులకు ఆటంకము కలిగించే లేదా బాధించే విధముగా, మనలను హాని కలిగించే లేదా ఇతర విశ్వాసులను హాని కలిగించే విధముగా ఉన్న క్రైస్తవ స్వేచ్ఛను నిరుత్సాహపరచడము ద్వారా పౌలు ఒక అడుగు ముందుకు వేసాడు. చిన్న సమస్యలపై వివాదములతో మనలను మరియు మన సాక్ష్యమును నాశనము చేయడానికి సాతాను ఇష్టపడతాడు, కాని మన ప్రాధాన్యత దేవుని రాజ్యము మరియు సమాధానమును అనుసరించడము మాత్రమే అయి యుండాలి. ఒకరి జీవితములో దేవుని పనిని నాశనము చేయడమో లేదా వాటిని పొరపాట్లు చేయుటకు గాని మనము ఇష్టపడము. మన సోదరుడు లేదా సోదరి మనము చేసే పనులతో బాధపడుతుంటే (15 వ వచనము), మనము ఇంకను ప్రేమలో నడవడము లేదు అని అర్థము. పరిశుద్ధాత్మకు సున్నితముగా లోబడుతు జీవించడము నేర్చుకుందాము, విమర్శించడానికి బదులుగా ఉద్ధరించడానికి ఎంచుకుందాము. ఈ వారము క్రీస్తులో మీ సహోదర సహోదరీలను మీరు ఏ ఏ విధములుగా వృద్ధిపెంపొందించవచ్చును? ఇతరులతో ఐక్యత మరియు వారి స్వేచ్ఛ వైపు కొన్ని చిన్న మార్పులు చేయడములో మీకు సహాయపడటానికి పరిశుద్ధాత్మ దేవుని కొరకు ప్రార్థించండి.

**ఒక్కొక్క మెట్టు ఎక్కే వారిగా ఉండండి, అంతేకాని అడ్డుబండలుగా ఉండకండి.**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## పదమూడవ పాఠము : 15 వ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము** : నిస్వార్థమైన త్యాగము, నిరీక్షణ యొక్క సందేశమును పంపుతుంది.

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15:1-3 వరకు అధ్యయనము చేయగలరు**

1. క్రొత్త విశ్వాసుల యెడల మనయొక్క బాధ్యత ఏమిటి?

2. ప్రభువులోని మన బలహీనమైన సహోదరులను ఎలా ఆదరించాలి?

3. మనము ఎవరిని సంతోషపరచవలెను?

4. మన ప్రవర్తన ద్వారా మనలో మరియు ఇతరులలో సాధించాలనే గొప్ప ఉద్దేశ్యము ఏమిటి?

5. ఫిలిప్పీయులకు 2: 5 మరియు 1 యోహాను 3:16 ప్రకారము, యేసు యొక్క మాదిరిని మనము ఎలా అనుసరించాలి?

6. I కొరింథీయులకు 10: 23-24 ప్రకారము, ఎవరి యొక్క మంచి ప్రయోజనాలను మన స్వంతదాని కంటే ఎక్కువగా ఉంచుతాము?

7. ఈ రోజు మీరు ఏ ఆలోచనను ధ్యానిస్తారు?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15:4-7 వరకు అధ్యయనము చేయగలరు**

1. లేఖన భాగములో మన బోధ యొక్క ఉద్దేశ్యము ఏమిటి?

2. ఈ క్రింది లేఖన భాగములలో మన నిరీక్షణ గురించి ఎలా మాట్లాడుతుంది? (2 కొరింథీయులు 4:18, యోహాను 14: 1-4, ఫిలిప్పీయులు 3:20)

3. ఐక్యతను వివరించడానికి ఈ వచనములలో కనిపించే పదములు ఏమిటి?

4. మనము ఒకరినొకరు ఎలా చేర్చుకోవలయును?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15:8-12 వరకు అధ్యయనము చేయగలరు**

1. యేసు సేవకుడైనప్పుడు యూదులలో ఏమి సాధించాడు?

2. యేసు సేవకుడైనప్పుడు అన్యజనులకు ఏమి సాధించాడు మరియు ప్రదర్శించాడు?

3. "యెష్షయిలో నుండి వేరు చిగురు" ఎవరిని సూచించుచున్నది?

4. నిరీక్షణకర్తయగు దేవుడు విశ్వాసులను దేనితో నింపుతాడు?

5. ఆనందము పొంగిపొర్లుతున్నందుకు మనలో ఎవరు పనిచేస్తారు?

6. మీలో లేదా ఇతరులలో ఈ ఆనందము మరియు సమాధానము ఎలా కనిపిస్తాయి?

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15:14-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. సంఘమును ప్రోత్సహించడానికి పౌలు ఏ పదాలను ఉపయోగించాడు?

2. ఇతరులను నాయకుడిగా ప్రోత్సహించడము ఎంత ముఖ్యమని మీరు అనుకుంటున్నారు (హెబ్రీయులు 10: 24-25 కూడా చూడగలరు)?

3. అన్యజనులకు పిలుపునివ్వడము మరియు సువార్తకు వారు ఇచ్చిన ప్రతిస్పందనను పౌలు ఎలా సూక్ష్మీకరించాడు?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 15:14-33 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు జీవితములో దేవుని యొక్క  పిలుపు ఏమిటి? (అపొస్తులుల కార్యములు 9:16 మరియు గలతీయులు 2:20 కూడా చూడగలరు)

2. దేవుడు కోరినది పౌలు తన జీవితములో నెరవేర్చాడా?

3. 18-19 వ వచనములలో, పౌలు తన విజయాలన్నిటికీ ఎవరికి ఘనత ఇచ్చారు?

4. క్రీస్తు కొరకు ఈ పనిని నెరవేర్చడానికి పౌలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు (2 కొరింథీయులు 11: 23-28 చూడగలరు)?

5. మీ జీవితములో దేవుని యొక్క పిలుపు మీకు అర్థమైనదా?

6. ఇతరుల పట్ల నీ యొక్క ఉద్దేశ్యమును వివరించుము ?

**ఆరవ రోజు** :

పదమూడవ పాఠము : **"నిస్వార్థమైన త్యాగము నిరీక్షణ యొక్క సందేశమును పంపుతుంది."**

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 15 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 15:4 "ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి." |
| **పాఠ్యాంశ వాక్యము** | నిస్వార్థమైన త్యాగము, నిరీక్షణ యొక్క సందేశమును పంపుతుంది. |
| **జీవిత సూత్రము** | దేవుని ద్వారా వచ్చే మనయొక్క పిలుపు, జీవించడము యొక్క ఉద్దేశ్యాన్ని సంతృప్తిపరుస్తుంది. |

**సారాంశము** :

15 వ అధ్యాయములో పౌలు బలహీనమైన మరియు బలవంతులైన సోదరుల గురించి మాట్లాడుటను మనము గమనిస్తున్నాము. ఒకరినొకరము అంగీకరించడము అనేది తేడాలున్న వారి మధ్య ఐక్యతను సాధించగలదని ఆయన తేల్చిచెప్పారు. మనము స్వప్రయోజనము కోరుకొనక, ఇతరుల యొక్క ప్రయోజనము కొరకు, అభివృద్ధి కొరకు వారికి సేవ చేయవలయును (1 కొరింథీయులు 10:33). బలహీనులకు సహాయపడడానికి మరియు వారి భారములను భరించడానికి నైతిక బాధ్యతతో మనము దేవుని పిల్లలుగా జీవించవలయును (గలతీయులు 6: 2). నిస్వార్థ ప్రేమకు యేసు క్రీస్తు జీవితమే మనకు మాదిరియై యున్నది. అతను తృణీకరించబడ్డాడు మరియు తిరస్కరించబడ్డాడు, అయినప్పటికీ మన కొరకు సిలువకు వెళ్ళాడు. మనము ఒకరికొరకు ఒకరము ఎంత దూరము వెళ్ళగలము?

ఇది నిరీక్షణ అధ్యాయము! ఈ అధ్యాయములో నిరీక్షణ నాలుగుసార్లు ప్రస్తావించబడినది. నిరీక్షణ యొక్క నిర్వచనము హెబ్రీయులు 11: 1 లో కనబడుచున్నది "విశ్వాసమనునది నిరీక్షింపబడువాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది". ఈ రకమైన నిరీక్షణ మనకు సంపూర్ణ భద్రత మరియు భరోసాను ఇచ్చును. దేవుడు ఈ నిరీక్షణ యొక్క మూలము, ఆధారము మరియు కర్త ఎందుకనగా ఆయన లేని జీవితము నిరాశాజనకముగా ఉంటుంది. ఆ నిరీక్షణ తో అనుసంధానము కావడానికి ఒక మంచి మార్గము – లేఖన భాగముల ద్వారా మాత్రమే ఉంటుంది. ఆయన స్వరమును వినడానికి, దిద్దుబాటును స్వీకరించడానికి మరియు ప్రోత్సాహాన్ని పొందడానికి మనము ప్రతిదినము దేవుని వాక్యములో ఉండాలి. దేవుడు తన వాక్యములో మనకు గుర్తుచేసే వాగ్ధానములను మనము పట్టుకోవడము ద్వారా, అది మనకు తాజా నిరీక్షణను ఇస్తుంది. ఇది ఈ లోకము అర్థము చేసుకోలేని ప్రోత్సాహము, కాని పరిశుద్ధాత్మ మనలో ప్రతి ఒక్కరిని పిలిచే పనిని పూర్తి చేయడానికి ఈ లోకములో మనకు అవసరమైన నిరీక్షణతో శక్తినిస్తుంది.

క్రీస్తు వచ్చినప్పుడు, దేవుని సత్యమును చూపించాడు, దీర్ఘకాలముగా ఎదురుచూస్తున్న వాగ్ధానములను నెరవేర్చాడు మరియు యూదులకు మరియు అన్యజనులకు దేవుని మహిమను చూపించాడు. దేశాలు ఎల్లప్పుడూ దేవుని ప్రణాళికలో ఉండేవి. మోషే, కీర్తనలు 117, మరియు యెషయా అందరూ యుగాలలో క్రీస్తుకు ప్రతిస్పందించే వారందరిని చేర్చుతూ స్తుతించమని తెలియజేసారు. సువార్త సందేశమును అన్ని దేశాలకు తీసుకురావడానికి దేవుడు ఉపయోగించిన అత్యంత ఉపయోగకరమైన సాధనాల్లో పౌలు ఒకరు. అతడిని వెళ్లి అన్యజనులకు సువార్త ప్రకటించమని దేవుడు పిలిచాడు. ఇక్కడ, 15 వ అధ్యాయము చివరలో, తన యొక్క లక్ష్యము దాదాపుగా పూర్తయిందని ఆయనకు తెలుసు. అతను పంపిన చోట బోధన ముగించాడు మరియు నమ్మకముగా పూర్తి చేయడానికి దేవుడు కృప చూపించినందుకు మహిమ తెచ్చాడు. అతను ఈ అధ్యాయాన్ని కలిసి పోరాడటానికి మరియు ఉజ్జీవింప బడుటకు ప్రార్థనతో ముగించాడు. అతను వారి ప్రార్థనలను కూడా అడిగాడు. మనము ప్రార్థన చేసేవాళ్ళము, ఇతరులచే మరియు దేవుని సన్నిధి ద్వారా ఉజ్జీవింప బడవలయును.

**దేవుని ద్వారా వచ్చే మనయొక్క పిలుపు, జీవించడము యొక్క ఉద్దేశ్యాన్ని సంతృప్తిపరుస్తుంది.**

# రోమీయులకు వ్రాసిన పత్రిక : రక్షణ కొరకైన దేవుని శక్తి

## పద్నాలుగవ పాఠము : 16 వ అధ్యాయము

**పాఠ్యంశ వాక్యము** : తెలివిగా ఉండవలయును, దృష్టిని కేంద్రీకరించవలయును మరియు బాగుగా సంపూర్తి చేయవలయును!

**మొదటి రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 16:1-16 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ అధ్యాయములోని మహిళల పేర్లు మరియు పౌలు ప్రతి ఒక్కరిని ఎలా అభినందిస్తున్నారో తెలియజేయగలరు ?

2. ఏ పదాలు పౌలు స్నేహితులను వివరిస్తాయి?

3. మీ జీవితాన్ని వివరించడానికి మీరు ఏ వర్ణనను ఎక్కువగా కోరుకుంటారు?

**రెండవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 16:17-18 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు తన లేఖను ముగించుచున్నప్పుడు రోమీయులకు గుర్తుచేసే హెచ్చరికలు ఏమిటి?

2. ప్రజలు సువార్తకు విభజనలు మరియు అడ్డంకులు కలిగించినప్పుడు, వారు ఎవరికి సేవ చేస్తున్నారు?

3. మీ కొరకు మరియు మీ సంఘము కొరకు మీరు ఎలా ప్రార్థించవచ్చును?

**మూడవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 16:19-27 వరకు అధ్యయనము చేయగలరు**

1. రోమీయులు దేనికి ప్రసిద్ధి చెందినవారు?

2. ఒకప్పుడు దాగి ఉన్న రహస్యము ఇప్పుడు వెల్లడైనది, దానిని వివరించగలరు? (ఎఫెసీయులకు 3: 3-6 మరియు కొలొస్సయులు 1: 26-27 కూడా చూడగలరు)

3. ఆ ప్రత్యక్షత ఎవరు?

4. ఈ వచనములలో వెల్లడైన దేవుని కొన్ని లక్షణాలను మీరు వ్రాయవలయును?

5. దేవుడు ఏమై యున్నాడో అని ఆలోచిస్తూ కొంత సమయము గడుపగలరు మరియు ఆయనను స్తుతించగలరు.

**నాలుగవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 16:20-27 వరకు అధ్యయనము చేయగలరు**

1. మనము మరియు రోమీయులు విశ్వాసులుగా ఎదుర్కొంటున్న ఆధ్యాత్మిక యుద్ధము గురించి పౌలు ఏ వాగ్ధానము ఇచ్చాడు?

2. ఈ వాగ్ధానము ఇప్పుడు మరియు భవిష్యత్తు కొరకు ఎలా నెరవేరుతుంది? (ప్రకటన 20:10 కూడా చూడగలరు)

3. దేశముల కొరకు మనయొక్క బాధ్యత ఏమిటి?

4. ఈ బాధ్యతలో మీరు ఎలా పాల్గొంటున్నారు?

**అయిదవ రోజు** :

**రోమీయులకు వ్రాసిన పత్రిక 16 వ అధ్యాయమును అధ్యయనము చేయగలరు**

1. ఈ పత్రికలో మీకు ఏది అతి ప్రాముఖ్యముగా ఉన్నది, అని అనిపిస్తుంది?

2. మీరు దానిని ఎలా జ్ఞాపకముంచుకుంటూ మరియు అభ్యాసము చేస్తారు?

3. దేవుడు ఎవరో, ఆయన మీకు చూపించిన దాని కొరకు స్తుతించగలరు మరియు అతను వాగ్ధానము చేసిన వాటిని చేయడానికి అతను నమ్మకముగా ఉంటాడని మనకు తెలియును, అన్నింటిని బట్టి దేవుడిని స్తుతించవలయును.

**ఆరవ రోజు** :

పద్నాలుగవ పాఠము : "**అన్ని దేశాల కొరకైన దేవుని ప్రణాళిక**"

| | |
|---|---|
| **లేఖన భాగము** | రోమా 16 వ అధ్యాయము |
| **ప్రాముఖ్యమైన వచనము** | రోమా 16:19 "మీ విధేయత అందరికిని ప్రచురమైనది గనుక మిమ్మునుగూర్చి సంతోషించుచున్నాను. మీరు మేలు విషయమై జ్ఞానులును, కీడు విషయమై నిష్కపటులునై యుండవలెనని కోరుచున్నాను." |
| **పాఠ్యాంశ వాక్యము** | నమ్మకమైన స్నేహితులు మరియు జత పనివారికి తుది వీడ్కోలు. |
| **జీవిత సూత్రము** | ప్రతి వ్యక్తి విలువైనవాడు మరియు దేవుని రాజ్యము పట్ల తన సహకారము కలిగి ఉంటాడు! |

**సారాంశము** :

ఈ పత్రిక అంతటా పౌలు యొక్క హృదయాన్ని మనము చూశాము. ఇక్కడ అతను తన స్నేహితులను పేరు ద్వారా పిలుస్తున్నాడు, వారు తన జీవితాన్ని ఎలా సుసంపన్నము చేశారో మరియు అతను వారిని ఎంతగానో మెచ్చుకుంటున్నాడో అర్థము అవుతుంది. మన ఈమెయిల్‌లు, ఫోన్ సంభాషణ మరియు ఇతర సంభాషణలలో దీనిని మరింతగా అభ్యసించడము అనేది మంచి ఆలోచన అనిపిస్తుంది. మనము దేవుని విషయాలలో ముందుకు సాగడానికి మనందరికీ ప్రోత్సాహకరమైన స్పర్శ లేదా మాటలు అవసరము. ఆధ్యాత్మికముగా శ్రద్ధ వహించడానికి మరియు సంపన్నము చేయడానికి దేవుడు మీ జీవితములో ఎవరిని పెట్టాడు?

పౌలు 29 మందిని, వారిలో 1/3 మంది స్త్రీలను ప్రస్తావించాడు, వారిలో సగం మంది బానిస తరగతి నుండి వచ్చినట్లు తెలుస్తోంది. జాబితా అంతటా మనము రోమాలోని సంఘము యొక్క జాతీయ, జాతి మరియు సామాజిక నేపథ్యముల సూచనలను ఎంచుకోవచ్చును. కొంతమంది ఖైదీలు, బానిసలు, గృహములో ఉండేవారు, గ్రీకు, యూదు మరియు రోమా వారు. వారి సామాజిక స్థానము, జాతీయత లేదా జాతి కారణముగా కాక క్రీస్తులో వారు ఏమైయున్నారో లేదా స్థానము ద్వారా సంఘములో వారు విలువైన వారుగా ఉన్నారు. ఈ స్వేచ్ఛ పౌలు రాసిన అనేక పత్రికలో మనము చూడగలుగుతాము. గలతీయులకు 3:28 "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థు డని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు".

ప్రత్యేకించి, సువార్తను వ్యాప్తి చేసే పనిలో సహకరించిన చాలా మంది మహిళల గురించి, బాధ్యత మరియు గౌరవము రెండింటినీ చూపిస్తున్న వారి గురించి మనము గమనిస్తూనే ఉన్నాము. క్రొత్త నిబంధన అంతటా, మనము ఆదిమ సంఘములో స్త్రీలను మరియు వారి ప్రాముఖ్యతను చూస్తున్నాము. మహిళలు జత పనివారు, అన్ని జాతులు మరియు నేపథ్యములను అంగీకరించారు మరియు గౌరవించారు. ఈ రోజు మన సంఘములు అటువంటి వైవిధ్యాన్ని మరియు ఐక్యతను చూపించక పోతున్నాయని దుఃఖముతో అంగీకరించాలి, కాని మనమందరము దేవుని పనిలో ఒక భాగమై ఉన్నాము! మనలో మార్పుతో ఆ పిలుపుచే పిలువబడ్డాము. అపొస్తలుల కార్యములు 9: 15-16లో పౌలుకు దేవుడు చాలా ప్రత్యేకమైన పిలుపునిచ్చాడు, మనలో ప్రతి ఒక్కరికి మన జీవితములో దేవుని కృపను గురించి ఒక ప్రత్యేకమైన కథ ఉంది! ప్రతి వ్యక్తి పౌలుకు ముఖ్యము, అతడు వారిని ప్రియమైనవాడు, బంధువు, జత పనివారు, ఎన్నుకోబడినవాడు, నాకు తల్లి అని పలు రకాలుగ పిలుచుటను మనము గమనించవచ్చును. క్రీస్తులో మన ఏకత్వము కారణముగా, మనము లోకములో

ఉన్నవారి కంటేను భిన్నమైన వైఖరిని ప్రదర్శించాలి. ఈ వైఖరి మన చుట్టూ ఉన్న వారి పట్ల, మన కార్యాలయములో, మన స్నేహములలో మరియు మన బోధనలో ప్రత్యేకముగా ఉండవలయును.

17 వ వచనములో, తగాదాలు మరియు ఇబ్బందులను కలిగించే బోధనకు వ్యతిరేకముగా పౌలు వారి దృష్టి తీసుకువచ్చాడు, పౌలు వారి జీవితములలో ప్రయాసపడిన దానికి విరుద్ధమైన బోధ ఇది. ఇలాంటి విభజన విషయాలను బోధించే వారి నుండి తప్పుకోవాలని ఆయన చెబుతున్నాడు. ఇంతకుముందు మనము అనుసరించిన ప్రాపంచిక విషయాలకు వ్యతిరేకముగా నిలబడకపోతే ఇప్పటికిని మనలను అవి ప్రభావితము చేస్తాయి. సాతాను, ఈ లోకము మరియు మన శరీరముతో మనయొక్క యుద్ధము గురించి మనము తెలుసుకోవాలి. ఈ యుద్ధమును దేవుడు సిలువలో గెలిచాడు మరియు అందువలన, మనము ప్రస్తుత పోరాటములో ఉన్నప్పటికీ మనకు సమాధానమును కలిగి యుంటాము.

ఈ గొప్ప అధ్యయనాన్ని ముగిస్తున్నప్పుడు, పౌలు రోమా 12: 1 లో చెప్పిన ఈ విషయాన్ని మనకు గుర్తు చేస్తున్నారు, “కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది.” ఇంకా చెప్పాలంటే, పౌలు ప్రకటించిన ఈ గొప్ప వాస్తవాలన్నిటిని దృష్టిలో ఉంచుకుని, మన జీవితముతో మనము చేయగలిగే అత్యంత సహేతుకమైన, తెలివైన, ఆలోచనాత్మకమైన, ఉద్దేశపూర్వక పని ఏమనగా – మనము, దేవునికి మనలను సజీవ యాగముగా సమర్పించుకోవడము మరియు ఆయన కొరకు జీవించడము. ఇక మరేదియు కూడా పూర్తి చేయలేదు. అందువలన, మనలను ఆయనకు మాత్రమే ఇవ్వవలయును. ఇది మాత్రమే చేయవలసిన ఏకైక సహేతుకమైనది, విలువైనది, ప్రాణాలను రక్షించే విషయము. మనము ఇలా చేసినప్పుడు, మన అన్ని సంబంధాలలో మన జీవితము మారిపోవుటను గమనిస్తాము. మొదట, పన్నెండవ అధ్యాయము యొక్క తరువాతి భాగములో చూపినట్లుగా, మన సహోదరులకు సంబంధించి మార్చబడును. మన శరీరాన్ని సమర్పించడము సంఘములో మన యొక్క జీవితాన్ని ప్రభావితము చేయును. అప్పుడు, పన్నెండవ అధ్యాయము యొక్క చివరి భాగములో మరియు పదమూడవ అధ్యాయములో, ఇది ప్రభుత్వ అధికారులతో మరియు సమాజము లోని అందరితో మన సంబంధాన్ని ప్రభావితము చేస్తుందని పౌలు గారు చెప్పారు. పద్నాలుగో అధ్యాయంలో చర్చించినట్లు మన అంతర్గత వైఖరులు కూడా భిన్నముగా ఉంటాయి. బలహీనుల పట్ల మన వైఖరులు మనము క్రైస్తవుడిగా ఉండటానికి ముందు ఉన్న దానికి పూర్తిగా విరుద్ధముగా ఉంటాయి. మరియు నశించిపోయిన (పదిహేనవ అధ్యాయము) వారి పట్ల మన వైఖరి పూర్తిగా భిన్నముగా ఉంటుంది. వారిని చేరుకోవటానికి మండుతున్న హృదయము ఉంటుంది, ఎందుకంటే మనము కూడా ఒకప్పుడు నశించి పోయినవారమే కాని మనకు కృప లభించినది. దేవుడుని స్తుతించే మన త్యాగము ఏమిటంటే, ఆయన ప్రేమించిన మరియు ఆయన రాజ్యంలోకి పిలిచిన వారికి ఆయన చేసినట్లుగా మనలను మనమే అర్పించుకోవడము.

రోమా 16:25-27 “సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు, అనాదినుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము, నిత్యదేవుని ఆజ్ఞప్రకారము ప్రవక్తల లేఖనములద్వారా వారికి తెలుపబడియున్నది. ఈ మర్మమును అనుసరించియున్న నా సువార్త ప్రకారము గాను, యేసు క్రీస్తునుగూర్చిన ప్రకటన ప్రకారముగాను, మిమ్మును స్థిరపరచుటకు శక్తిమంతుడును అద్వితీయ జ్ఞానవంతుడునైన దేవునికి, యేసుక్రీస్తుద్వారా, నిరంతరము మహిమ కలుగునుగాక. ఆమేన్.” క్రీస్తు శరీరములోని అవయవము(సభ్యుని) గా మీ యొక్క పిలుపు మీకు తెలుసా? మీరు బాగుగా పూర్తి చేయడముపై దృష్టి పెట్టారా? చర్చించండి.

**ప్రతి వ్యక్తి విలువైనవాడు మరియు దేవుని రాజ్యము పట్ల తన సహకారము కలిగి ఉంటాడు!**